www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి
EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:89 SUNDAY , AUGUST 16, 2026 PAGES:8 COST: 4 /-
ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 89 ఆదివారం 16 ఆగస్టు 2026 పేజీలు :8 వెల: 4/-



# అర్హులందరికీ రేషన్ కార్డులు..



అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ప్రకటన

ఇప్పటికే 16 లక్షల కొత్త కార్డులు జారీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్న బియ్యం ఉచితంగా పంపిణీ

స్మార్ట్ రేషన్ కార్డు కుటుంబానికి గౌరవం, భరోసా అని వ్యాఖ్యలు

హంసకలం వార్త : రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ మిగతా2లో

# ఫామ్‌హౌస్‌లో కాదు.. అసెంబ్లీలోకి రా..



## కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్

### త్వరలోనే ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం

కేసీఆర్‌కు రేవంత్ అసెంబ్లీ సవాల్

రైతుల అంశంపై చర్చకు పిలుపు

ఫామ్‌హౌస్‌లో ఉండి విమర్శలు వద్దన్న సీఎం

బీఆర్ఎస్, బీజేపీపై విమర్శలు

సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల ప్రారంభం

హంసకలం వార్త : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మేలు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అన్యాయాలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని అన్నారు. ఫామ్‌హౌస్‌లో ఉండి విమర్శలు చేయడం కాదని, ప్రజల ముందుకు వచ్చి మాట్లాడాలని అన్నారు.సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు.గతంలో వరి వేస్తే ఉరి మిగతా2లో

# 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతాం

## 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని



● 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మారుస్తామని హామీ ● తొలిసారిగా ఎర్రకోట నుంచి 'వందేమాతరం' వినిపించడం చరిత్రాత్మకమని వ్యాఖ్య ● ఒకప్పుడు 'ఫ్రాజైల్ ఫైవ్'లో ఉన్న మనం, ఇప్పుడు వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా ఎదిగాం ● దేశంలోని వరద బాధితులకు యావత్ దేశం అండగా ఉంటుందని భరోసా 2

# తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం





● తెలంగాణలో సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం గోల్కొండలో జాతీయ జెండాను ఎగురవేసిన సీఎం ● రేవంత్ రెడ్డి ● ఆయుధం లేకుండా అహింసతో స్వాతంత్ర్యం సాధించామని వ్యాఖ్య ● దెబ్బతిన్న వ్యవస్థలను 32 నెలల్లో గాడిలో పెట్టామని ప్రకటన ● తెలంగాణ తలసరి ఆదాయం దేశం కంటే 91 శాతం అధికమని వెల్లడి ● రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని సీఎం వ్యాఖ్య ● బలమైన ప్రజాస్వామిక భారత్ నిర్మాణానికి పిలుపు 2



# ప్రజల అవసరాలే పరమావధిగా పాలన సాగిస్తున్నాం

హంసకలం వార్త : తెలంగాణ ప్రజల అవసరాలే పరమావధిగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు, విద్యార్థులు, రైతులు సహా అన్ని వర్గాలకూ సంక్షేమం అందుతోందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో కాలయాపన చేసిందని విమర్శించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. మిగతా2లో



# 22ఏ పేరుతో భారీ దోపిడీ జరుగుతోంది

● నిషేధిత భూముల ముసుగులో భారీ దోపిడీ జరుగుతోందన్న బండి సంజయ్

● ఏకంగా 95 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారని ప్రశ్న 2

● ప్రభుత్వం వేలం వేసిన భూములను కూడా ఈ జాబితాలో చేరుస్తున్నారని విమర్శ

# ఆలయ గర్భగుడిలో మైనర్‌పై అఘాయిత్యం..

● రామచంద్రాపురం ఆలయ గర్భగుడిలో బాలికపై లైంగిక దాడి ఆరోపణలు

● నిందితుడైన వృద్ధ పూజారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న స్థానికులు

● మైనర్ బాలికను రక్షించి, నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు

● గతంలోనూ ఆలయంలో అసాంఘిక కార్యకలాపాలు జరిగాయని స్థానికుల ఆరోపణ

● ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న రామచంద్రాపురం పోలీసులు 2



పవిత్రమైన ఆలయ గర్భగుడిలోనే ఓ మైనర్ బాలికపై వృద్ధ పూజారి లైంగిక దాడికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి.

# భారత్ తనకంటూ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుంది

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత్‌కు శుభాకాంక్షలు

భారత్-రష్యా బంధం మరింత బలపడుతుందని వ్యాఖ్య

ఐఎస్ఎస్ నుంచి రష్యా వ్యోమగాముల శుభాకాంక్షలు

భారత్-రష్యా అంతరిక్ష బంధాన్ని గుర్తుచేసిన కికీనా



2

భారత్ సాధిస్తున్న ప్రగతిని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించారు. ఆర్థిక, సామాజిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ అద్భుతమైన విజయాలు సాధిస్తోందని అన్నారు.

# 'ఆయన చెప్పింది నిజమే'



✦ అవినీతిపై రాజగోపాల్ రెడ్డి తీవ్ర ఆరోపణలు

✦ రూ.5 లక్షల ఇంటికి 500 నిబంధనలంటూ మండిపాటు

✦ భారీ దోపిడీ జరుగుతోందని ఆరోపణ

✦ రాజగోపాల్ మాటలతో ఏకీభవిస్తున్నానన్న కేటీఆర్

✦ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

హంసకలం వార్త :కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన తీవ్ర ఆరోపణలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మద్దతు తెలిపారు. అభివృద్ధి పేరుతో కొందరు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.లక్షల కోట్లు మిగతా2లో

# నల్గొండ నా ఊపిరి

## అభివృద్ధే నా ధ్యేయం



నల్గొండలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కోమటిరెడ్డి

తన శ్వాస ఉన్నంత వరకు జిల్లా ప్రజల కోసమే పనిచేస్తానన్న మంత్రి

జిల్లాలో నీటి కష్టాలు తీర్చే బాధ్యతను తాను తీసుకుంటానని వ్యాఖ్య

నల్గొండ జిల్లాను అభివృద్ధి పథంలో పయనింపజేసి, తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.

హంస కలం వార్త
HAMSA KALAM VARTA
ఆదివారం 16 ఆగష్టు 2026

# తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం

గోల్కొండ కోటలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని జాతీ య జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపా రు. ప్రపంచ చరిత్రలోనే ఆయుధం లేని యుద్ధం భారత స్వాతంత్ర్య పోరాటమని అన్నారు. అహింస తోనూ విజయాన్ని సాధించవచ్చని మహాత్మాగాంధీ నిరూపించారని చెప్పారు. దేశ తొలి ప్రధాని జవహ ర్‌లాల్ నెహ్రూ అభివృద్ధికి బలమైన పునాదులు వేశా రని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం జీవనానికి ఆధార మని, దానికి వెల కట్టలేమని గాంధీజీ చెప్పారని రేవ ంత్ రెడ్డి గుర్తుచేశారు. హరిత విప్లవం, శ్వేత విప్ల వం, నీలి విప్లవం ద్వారా దేశంలోని వివిధ రంగాల అభివృద్ధికి గత ప్రభుత్వాలు కృషి చేశాయని అన్నారు. తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛను అందిం చడంతో పాటు విధ్వంసకర పాలన నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం ప్రయత్ని స్తోందని చెప్పారు. తెలంగాణ భవిష్యత్తుకు అవస రమైన కార్యాచరణను సిద్ధం చేసుకుని ముం దుకు సాగుతున్నామని వెల్లడించారు. ప్రజా ప్రభు త్వం అధికారంలోకి వచ్చి 32 నెలలు పూర్తయ్యాయని సీఎం తెలిపారు. దెబ్బతిన్న వ్యవస్థలను ఒక్కొక్కటిగా గాడిలో పెడుతున్నామని చెప్పారు. తమ సంక్షేమ పథ కాలను కేవలం ఆర్థిక లెక్కలతో చూడటం లేదని స్పష్టం చేశారు. సంక్షేమంలో మానవీయత ఉందని, పేదల పట్ల బాధ్యత ఉందని అన్నారు. వారి జీవితా ల్లో ఆనందం నింపాలన్న తపనతో కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఓట్ల కోసం లేదా మొక్కుబడిగా సంక్షేమాన్ని అమలు చేయడం లేదని స్పష్టం చేశారు. 32 నెలల్లో ప్రభుత్వం చేసిన కృషి ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ తలసరి ఆదాయం పెరగడం దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. దేశ తలసరి ఆదా యంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం 91 శాతం అధికంగా ఉందని చెప్పారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నది తమ ప్రభుత్వ నమ్మకమని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళు తున్నామని అన్నా రు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను సీఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వా న్ని కాపాడుకోవాలని, పరస్పర గౌరవం, దేశ భక్తి విలువలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. అస మానతలు లేని, శాంతి, సౌభ్రాతృత్వాలతో కూడిన బలమైన ప్రజాస్వామిక భారతదేశాన్ని నిర్మించడమే సమరయోధులకు నిజమైన నివాళి అని అన్నారు. ప్రతి పౌరుడికి సమన్యాయం, సమానత్వం, స్వేచ్ఛ అందేలా నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ కర్తవ్య నిష్ఠతో, అంకితభావంతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతాం..

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసం గించారు. దేశం సరికొత్త సంకల్పంతో ముందు కు సాగు తోందని చెబుతూ, 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమ ని స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక రోజున స్వాతం త్ర్య సమర యోధులకు, విప్లవకారు లకు, మహాత్మా గాంధీకి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భ ంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "ఇదొక చారిత్రా త్మక దినం. స్వాతం త్ర్యం వచ్చిన తర్వాత ఎర్రకోట ప్రాకారాల నుంచి 'వందే మాతరం' గీతం వినిపిం చడం ఇదే ప్రథమం. ఈ రోజు ప్రతి ఒక్కరి హృదయ ంలో వందేమాతరం ప్రతిధ్వని స్తోంది. ప్రతి ఇంట్లో మువ్వన్నెల జెండా ఎగురుతోంది, ప్రతి మదిలోనూ త్రివర్ణ పతాకం నిలిచి ఉంది" అని అన్నారు. దేశ ఆర్థిక ప్రగతిని వివరిస్తూ.. "ఒకప్పుడు మనల్ని 'ఫ్రాజైల్ ఫైవ్' (అతి బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థలు) దేశాల్లో ఒకటిగా లెక్కించేవారు. కానీ, కేవలం 12 ఏళ్లలోనే ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ గా భారత్ అవతరి ంచింది. గడిచిన 12 ఏళ్లుగా ప్రతి ఒక్కరూ దేశాన్ని అభివృద్ధి పథంలో నిలపడానికి కృషి చేస్తున్నారు. స్వాతం త్ర్యానంతరం భారత్ పెద్ద కలలే కన్నది, కానీ ఆశించిన వేగంతో ప్రగతి సాధించ లేకపోయాం. ఈ రోజు భారత్ అపూర్వమైన వేగం, ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకెళతోంది. ఇప్పుడు 140 కోట్ల భారతీయుల సంకల్పాన్ని ఏ శక్తీ ఆపలేదు" అని మోదీ ఉద్ఘాటించారు. భవిష్యత్ లక్ష్యాలపై మాట్లాడుతూ.. "మన కలలు, సంకల్పాలు పెద్దవిగా ఉండాలి. అప్పుడే మన సామ ర్థ్యాలు ఉన్నత శిఖరాలకు చేరుతాయి. భారత్ సరికొత్త శిఖరాలను అధిరోహించడానికి పెద్ద కలలు కంటోంది. 2047 నాటికి దేశం అభివృద్ధి చెందేలా నేను చూస్తాను. అత్యధిక జనాభా కలిగిన దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారినప్పుడు, ప్రపంచం మనల్ని కచ్చితంగా భిన్నంగా చూస్తుంది" అని ప్రధాని పేర్కొన్నారు. ఇటీవల దేశంలోని కొన్ని ప్రాంతాల్లో సంభవించిన వరదలు, కొండచరియలు విరిగిపడటం వల్ల నష్టపో యిన కుటుంబాల బాధను తాను అర్థం చేసుకో గలనని, వారికి యావత్ దేశం అండగా నిలుస్తుందని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు.

# నల్గొండ నా ఊపిరి.. అభివృద్ధే నా ధ్యేయం

నల్గొండ జిల్లాను అభివృద్ధి పథంలో పయనింపజేసి, తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్గొండ పోలీస్ పరేడ్ మైదాన ంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నల్గొండ నేల చూపిన త్యాగం, ఆత్మగౌరవం స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీకలని అభివర్ణించారు. తన శ్వాస ఉన్నంత వరకు జిల్లా ప్రజల ఆశలు, ఆకాంక్షల కోసమే పనిచేస్తానని చెప్పారు. జిల్లాలో సాగు, తాగునీటి కష్టాలను శాశ్వతంగా తీర్చే బాధ్యత తాను తీసుకుంటానని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమానికి పెద్దపీట వేస్తూ 5.35 లక్షల మంది రైతులకు రూ. 715 కోట్ల రైతు భరోసా, 1.99 లక్షల మంది పింఛనుదారులకు రూ. 51.28 కోట్లు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే 17,873 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి 4,360 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశామని, 2.56 లక్షల కుటుంబాల కు గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు.నల్గొండ పట్టణంలో 24 గంటల మంచినీటి సరఫరా లక్ష్యంతో రూ. 83 కోట్ల ప్రాజె క్టుకు శంకుస్థాపన చేయడమే కాకుండా, పట్టణా భివృద్ధి కోసం మరో రూ. 300 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. యువతకు ఉపా ధి అవకాశాలు పెంచేందుకు రూ. 20 కోట్లతో ఎన్‌ఏ సీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నా మని, అమరవీరుల త్యాగాల సాక్షిగా నల్గొండ జిల్లాను అన్ని రంగాల్లోనూ ప్రథమ స్థానంలో నిలబెడ తానని హామీ ఇచ్చారు.

# ప్రజల అవసరాలే పరమావధిగా పాలన సాగిస్తున్నాం

తెలంగాణ ప్రజల అవసరాలే పరమావధిగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు, విద్యార్థులు, రైతులు సహా అన్ని వర్గాలకూ సంక్షేమం అందుతోందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో కాలయాపన చేసింద ని విమర్శించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహా లక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య ను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోం దని తెలిపారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటి గ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని భట్టి చెప్పుకొచ్చారు. విద్యా రంగంలో మౌలిక సదుపా యాలను మెరుగుపరిచి విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేందుకు చర్యలు చేపడుతు న్నామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, అన్నదా తల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రైతు భరోసాతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమ లు చేస్తున్నామని చెప్పారు. రైతులకు అండగా నిలు స్తూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. తెలంగాణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులకు భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు మరింత సమర్థవంతంగా అందేలా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

# భారత్ తనకంటూ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుంది

భారత్ సాధిస్తున్న ప్రగతిని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించారు. ఆర్థిక, సామాజిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ అద్భుతమైన విజ యాలు సాధిస్తోందని అన్నారు. ప్రపంచ వేదికపై భారత్ తనకంటూ ప్రత్యేక గౌరవాన్ని సంపాదిం చుకుందని పేర్కొన్నారు. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీకి పుతిన్ శుభాకాంక్షలు తెలిపారు. భారత్, రష్యా మధ్య సంబంధాలు ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాయని పుతిన్ చెప్పారు. ఐక్యరాజ్యసమితి, ఎస్‌సీఓ, బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికల్లో రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సంబం ధాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి కొనసా గుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ భద్రత, స్థిరత్వానికి కూడా ఈ భాగస్వామ్యం ఉపయోగపడు తుందని అన్నారు. భారత్ అభివృద్ధి ప్రయాణా నికి రష్యా అండగా ఉంటుందని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్ ముందుకు సాగుతున్న తీరును చూస్తే ప్రజల కలలన్నీ నెరవేరుతాయనే నమ్మకం ఉందన్నారు. రష్యా మద్దతు భవిష్యత్తులోనూ కొనసాగుతుందని స్పష్టం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి రష్యా వ్యోమగాములు ప్యోటర్ దుబ్రోవ్, అన్నా కికీనా, ఆండ్రే ఫెద్యాయెవ్ కూడా భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్-రష్యా అంతరిక్ష సహకారాన్ని వారు గుర్తుచేశారు. 1975లో ఆర్యభట ఉపగ్రహ ప్రయో గంతో మొదలైన సహకారం 1984లో రాకేశ్ శర్మ అంతరిక్షయాత్రతో మరింత బలపడిందని కికీనా చెప్పారు. ప్రస్తుతం గగన్‌యాన్ కోసం భారత వ్యోమగాములకు రష్యాలో శిక్షణ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. భారత్, రష్యా స్నేహం చిరకాలం కొనసాగాలని ఫెద్యాయెవ్ ఆకాంక్షించారు.

# ఫామ్‌హౌస్‌లో కాదు.. అసెంబ్లీలోకి రా..

గతంలో వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లో మాత్రం వరి పండించారని రేవంత్ విమర్శించారు. ఇప్పుడు రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేపడుతుంటే బీఆర్‌ఎస్ విమర్శలు చేస్తోందన్నారు. రైతుల సంక్షేమంపై నిజమైన చర్చకు సిద్ధమైతే అసెంబ్లీ వేదికగా మాట్లాడుకుందామని సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీఆర్‌ఎస్, బీజేపీ ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని రేవంత్ అన్నారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి బొమ్మా బొరుసులాంటివని వ్యాఖ్యానించారు. పదేళ్లు అధికారంలో ఉన్నా పేదలకు సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ కోతలు వస్తాయని గతంలో బీఆర్‌ఎస్ ప్రచారం చేసిందని, కానీ ఇప్పుడు రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేవని రేవంత్ చెప్పారు. రైతు భరోసా పథకం కింద 32 నెలల్లో రూ.36 వేల కోట్లు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నివేదికల ప్రకారం దేశంలో తక్కువ అప్పులు ఉన్న రైతులు తెలంగాణలోనే ఉన్నారని అన్నారు. బీజేపీ నేతలు ఆ నివేదికలు చదివితే నిజాలు తెలుస్తాయని వ్యాఖ్యానించారు.దస్మార్ట్ రేషన్ కార్డులు కేవలం ప్లాస్టిక్ కార్డులు కావని, పేదల ఆత్మగౌరవానికి గుర్తని రేవంత్ చెప్పారు. ఆకలి తీర్చే భరోసానే ఈ కార్డుల ఉద్దేశమని అన్నారు. పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు రేషన్ వ్యవస్థను తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులు..

తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసిందని, ఇది ఒక చారిత్రక ఘట్టమని అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. గతంలో ప్రజలకు నాణ్యత లేని దొడ్డు బియ్యాన్ని సరఫరా చేసేవారని, అయితే తమ ప్రభుత్వం రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించి సన్న బియ్యాన్ని సేకరిస్తోందని తెలిపారు. దేశంలో మరే ఇతర రాష్ట్రంలో లేని విధంగా ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఆహార భద్రతకే కాకుండా, అది ఒక కుటుంబానికి ప్రభుత్వం కల్పించే గౌరవం, గుర్తింపు అని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో లేని ఎన్నో సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని, అందులో భాగంగానే ప్రతి నియోజకవర్గానికి 3,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను పరిశీలించి, త్వరలోనే వారికి కూడా కార్డులు జారీ చేస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# 'ఆయన చెప్పింది నిజమే'..

అభివృద్ధి పేరుతో కొందరు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.లక్షల కోట్లు దోచుకుంటున్నారని రాజగోపాల్ చేసిన వ్యాఖ్యలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని కేటీఆర్ అన్నారు. పేదలకు ఇల్లు కట్టుకోవడానికి రూ.5-6 లక్షలు ఇవ్వాలంటే ప్రభుత్వం 500 నిబంధనలు పెడుతోందని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. అదే సమయంలో పెద్ద మొత్తంలో దోపిడీ జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆయన ధ్వజమెత్తారు. రాజగోపాల్ రెడ్డి ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వంపై నేరుగా విమర్శలు చేశారు. అభివృద్ధి పేరుతో రాష్ట్రాన్ని దోచుకుంటున్న వారిపై పోరాడతానని హెచ్చరించారు. తన సహనాన్ని చేతకానితనంగా భావించవద్దని అన్నారు. పేదల ఇళ్ల విషయంలో నిబంధనలు కఠినంగా పెడుతున్న ప్రభుత్వం భారీ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు వేల కోట్ల అవినీతికి పాల్పడుతున్నారన్న రాజగోపాల్ రెడ్డి మాటలు నిజమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలను సొంత పార్టీ ఎమ్మెల్యేలే చేస్తున్నారని చెప్పారు. తెలంగాణను రాహుల్ గాంధీ, ఏఐసీసీకి ఏటీఎంగా మార్చుకున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణకు వచ్చిన ప్రతిసారీ ప్రధాని మోదీ రాష్ట్రం ఏఐసీసీకి ఏటీఎంగా మారిందని చెబుతున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. మరి అలాంటి ఆరోపణలు వస్తున్నప్పుడు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఈడీ దాడులు జరిగినా ఆ తర్వాత ఎలాంటి చర్యలు కనిపించలేదన్నారు.

# ఆలయ గర్భగుడిలో మైనర్‌పై అఘాయిత్యం..

పవిత్రమైన ఆలయ గర్భగుడిలోనే ఓ మైనర్ బాలికపై వృద్ధ పూజారి లైంగిక దాడికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. బాలికతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న పూజారిని స్థానికులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రామచంద్రాపురంలో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. రామచంద్రాపురంలోని ఓ ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న సాయన్న అనే వృద్ధుడు, ఓ మైనర్ బాలికతో గర్భగుడిలో అనుచితంగా ప్రవర్తిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. ఆ సమయంలో ఆలయానికి బయట నుంచి తాళం వేసి ఉండటంతో వారికి అనుమానం బలపడింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు, గ్రామ పెద్దలు కలిసి ఆలయ తలుపులు తెరిచి చూడగా, బాలికతో పూజారి అసభ్యకరంగా ప్రవర్తిస్తూ కనిపించాడు. ఆగ్రహానికి గురైన వారు అతడిని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రామచంద్రాపురం పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలికను రక్షించి, నిందితుడు సాయన్నను అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలు మైనర్ కావడంతో ఆమె వివరాలను గోప్యంగా ఉంచి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆలయం వంటి పవిత్ర ప్రదేశంలో ఇలాంటి ఘటన జరగడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఈ ఆలయ ప్రాంగణంలో కొన్ని అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని వారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.ఈ కేసును పోలీసులు అన్ని కోణాల్లోనూ విచారిస్తున్నారు. బాలిక ఆలయానికి ఎలా వచ్చింది? నిందితుడితో ఆమెకు ముందే పరిచయం ఉందా? ఈ ఘటనలో ఇంకెవరైనా ప్రమేయం ఉన్నారా? అనే అంశాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించి, వాంగ్మూలం నమోదు చేసే ప్రక్రియను చేపట్టారు. పోలీసుల దర్యాప్తు పూర్తయితేనే ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

# 22ఏ పేరుతో భారీ దోపిడీ జరుగుతోంది



తెలంగాణలో నిషేధిత భూముల జాబితా (22ఏ) ముసుగులో భారీ దోపిడీ సాగుతోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనల మధ్య ఎలాంటి తేడా లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న 2.77 కోట్ల ఎకరాల్లో ఏకంగా 95 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారని బండి సంజయ్ నిలదీశారు. ప్రజలు కష్టపడి కొనుక్కున్న స్థలాలు, పరిశ్రమలకు కేటాయించిన భూములు, ప్రభుత్వమే వేలం వేసిన భూములను కూడా ఈ జాబితాలో చేర్చి వేధిస్తున్నారని విమర్శించారు. విద్యాసంస్థల ఫీజు రీయింబర్స్ మెంట్ పాత బకాయిలను ఇంకా చెల్లించకుండా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్వాన్స్ ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. జెన్-జీ యువతకు స్థానం కల్పిస్తామనే కాంగ్రెస్ మాటలు నిజమైతే... వెంటనే యువకులకు మంత్రి పదవులు, ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలని సవాల్ విసిరారు.

# సంపాదకీయం

## పర్యావరణ చట్టానికి తూట్లు




చట్టాలలో ప్రజాప్రయోజన చట్టాలకు ఒక విశిష్ట స్థానం ఉంది. వాటికి ఒక సామాజిక కోణం ఉంటుంది. అలాగే ఆ చట్టాన్ని ఉదారంగా నిర్వచించాల్సి వస్తుంది. అయితే ఆ ఉదారత ఆ చట్టం ఎవరి కోసం అయితే నిర్దేశించిందో వారికి అనుకూలంగా ఉండాలి కానీ, ఆ చట్టాన్నే నిర్వీర్యం చేసేటట్టు ఉండకూడదు. సుప్రీంకోర్టు జూలై 29న వనశక్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఇచ్చిన తీర్పు ఒక ప్రజాప్రయోజనార్థ చట్టాన్ని ఆ చట్టం ఉద్దేశాలకు, మౌలిక స్వభావానికి భిన్నంగా నిర్వచించింది. ఆ చట్టం పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986.పర్యావరణ పరిరక్షణ చట్టం కింద 1994లో పర్యావరణ ప్రభావ అంచనా ఉత్తర్వును విడుదల చేశారు. అందులోని షెడ్యూల్‌లో 'ఏ ప్రాజెక్టు కొత్తగా మొదలుపెట్టాలన్నా, ఉన్న ప్రాజెక్టును విస్తరించాలన్నా పర్యావరణ అనుమతి లేకుండా చేయడం కుదరదు' అని ఉంది. 2006లో తెచ్చిన కొత్త ఉత్తర్వులోనూ చాలా స్పష్టంగా-- ఏ ప్రాజెక్టు మొదలుపెట్టాలన్నా ముందస్తు పర్యావరణ అనుమతి తప్పనిసరి అని ఉంది. అంటే 1994లో అంతర్లీనంగా ఉన్నది, 2006 నాటికి ప్రస్ఫుటంగా ఉంది. అయితే ఈ చట్టాన్ని ఉల్లంఘించేవారిలో బలమైన పెట్టుబడిదారులు ఉన్నారు. వారు ఎటువంటి పర్యావరణ అనుమతి లేకుండా తమ ప్రాజెక్టులను నిర్మించడమేగాక, కొందరైతే నిర్మాణం పూర్తిచేసి ఆ పరిశ్రమలను నడిపేస్తున్నారు కూడా.అలా అనుమతి లేకుండా నిర్మాణాలు చేసిన వారికి ఊరటగా కేంద్ర పర్యావరణ శాఖ 1994 నుంచి సడలింపు ఇస్తూ వచ్చింది. ఆ సడలింపు ప్రకారం, 'నిర్మాణం మొదలుపెట్టేశాక, లేదా పూర్తి చేసేశాక కూడా పర్యావరణ అనుమతి తీసుకోవచ్చు!' దీనిని 'ఎక్స్‌పోస్ట్ ఫ్యాక్టో' అనుమతి అంటారు. అటువంటి సడలింపులు చట్ట విరుద్ధమనీ, అలా చేయడానికి ఏ మాత్రం కుదరదనీ 2004 నుంచి సుప్రీంకోర్టు పలుమార్లు చాలా స్పష్టంగా చెబుతూ వచ్చింది. అయినా పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన మంత్రిత్వశాఖ 2017లో అటువంటి సడలింపు ఉత్తర్వును పర్యావరణ పరిరక్షణ చట్టం కింద మరొక్కసారి ఇచ్చింది. 2017 మార్చి 14 నాటికి అనుమతి లేకుండా నిర్మిస్తున్న లేదా నిర్మించినవారు తదుపరి ఆరు నెలల్లో అనుమతి తెచ్చుకోవటానికి అవకాశం కల్పించారు. ఈ ఆరు నెలలు కాస్తా 13 నెలలు అయ్యింది. అనుమతి లేకుండా ఇలా నిర్మించిన పరిశ్రమల్లో పర్యావరణ విధ్వంసకరమైనవి ఉంటాయి, ఈ పాటికే అవి చాలా నష్టం చేసి ఉంటాయి అనే సందేహం ఈ ఉత్తర్వు ఇచ్చినవారికి కలిగినట్టు మనకు అనిపించదు. అంతేగాక 'ఈ ఉత్తర్వును పర్యావరణ పరిరక్షణ కోసం ఇస్తున్నాం' అని రాసుకొచ్చారు! ఇది కేవలం ఈ ఒక్కసారికి మాత్రమే అని కూడా చెప్పారు. ప్రతిసారి ఈ ఒక్కసారికే అని చెప్పటం ఈ పాటికి పరిపాటి అయ్యింది.

మళ్లీ 2021లో ఒక ఆఫీస్ మెమోరాండం ఇచ్చారు. దాని ప్రకారం... అనుమతి లేకుండా మొదలుపెట్టినవారు ఏ భయం లేకుండా ఇప్పుడు అనుమతులు తీసుకోవచ్చు అని. ఇది చట్టం కింద ఇచ్చిన ఉత్తర్వు కాదు. అలాగే 2017 నాటి ఉత్తర్వులో లాగా ఇది ఒకసారికి మాత్రమే అని కూడా లేదు. అంటే, ఒక రకంగా పర్యావరణ అనుమతుల ప్రక్రియకే చమరగీతం పాడిన మెమోరాండం ఇది.

ఈ రెండిటినీ ముందుగా మద్రాస్ హైకోర్టు, జాతీయ హరిత ట్రైబ్యునళ్లలో ఛాలెంజ్ చేశారు. హైకోర్టు, ట్రైబ్యునల్ దాటుకుని ఈ వన శక్తి కేసు సుప్రీంకోర్టు వరకూ వచ్చింది. మే 14, 2025న సుప్రీంకోర్టు ధర్మాసనం దీని గురించి ఒక అద్భుతమైన తీర్పు ఇచ్చింది-- ఇటువంటి ఉత్తర్వులు, మెమోరాండంలు ఇవ్వడమంటే పక్కదారిలో పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని నీరుగార్చడమే అని, చట్టం ఉద్దేశం పరిరక్షణ అయితే విధ్వంసకర ప్రాజెక్టులకు పరిరక్షణ చట్టం కింద సడలింపు ఇవ్వడం ఎలా కుదురుతుందని తెలిపింది. అంతేగాక, సుప్రీంకోర్టు ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు 'ఇటువంటి సడలింపులు కుదరవు' అని చెప్పిన విషయాన్ని ఉటంకిస్తూ పర్యావరణ, న్యాయ సిద్ధాంత మేళవింపుగా తీర్పు ఇచ్చింది. 2017 నాటి ఉత్తర్వుని, 2021 నాటి మెమోరాండంను కొట్టివేసింది. భవిష్యత్తులో ఇటువంటి ఉత్తర్వులు లేదా మెమోరాండంలు ఇవ్వడానికి వీలులేదని కూడా చాలా స్పష్టంగా తెలియజేసింది.

ఈ తీర్పు మీద రియల్ ఎస్టేట్ లాబీ సంస్థ క్రెడాయ్ సమీక్ష కోరింది. ఇక్కడ గమనించాల్సింది ఈ కేసులో ప్రధాన పార్టీ అయిన కేంద్ర ప్రభుత్వం ఈ తీర్పును ఒప్పుకుంది. వారు కోరని సమీక్ష క్రెడాయ్ కోరింది. సమీక్ష తీర్పును ముగ్గురు సభ్యుల ధర్మాసనం వెలువరించింది. ఇద్దరు న్యాయమూర్తులు ఈ కేసును మళ్లీ వినాలి అని తీర్మానించగా, ఒక న్యాయమూర్తి మాత్రం ఇచ్చిన తీర్పు సరైనదే అని నవంబర్ 18, 2025న తీర్పు చెప్పారు. దానితో ఈ కేసు మళ్లీ ముగ్గురు సభ్యుల ధర్మాసనం దగ్గరికి వెళ్లింది. ఈ ధర్మాసనం జూలై 29న తన మలి తీర్పు ప్రకటించింది.

# హైదరాబాద్ లో ఈ గోలేంటి కాక్రోచ్ లకుసంబంధమేంటి?

**-చిలికిచిలికి గాలివానలా నల్సార్ యూనివర్సిటీ వివాదం?**

**-వివాదానికి కేంద్రబిందువు గా న్యాయ విద్యాసంస్థ?**

**-నల్సార్ వివాదంలోకి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా?**

**-విద్యార్థుల భవిష్యత్ దెబ్బ తీసే స్థాయికి వివాదం?**

**-విద్యార్థులపైనే కాదు అధ్యాపకుల పైనా ఆరోపణలు?**

**-నల్సార్ వివాదంపై కొనసాగుతున్న విచారణ?**

నల్సార్ యూనివర్సిటీ వివాదం చిలికిచిలికి గాలివానలా మారి విద్యార్థుల భవిష్యత్ ను దెబ్బతీసే స్థాయికి చేరింది. అసలు ఈ వివాదానికి కారణమేంటి? దీంతో కాక్రోచ్ లకు సంబంధమేంటి?

### -వివాదానికి కేంద్ర బిందువు గా న్యాయ విద్యాసంస్థ?

దేశంలోనే అత్యున్నత న్యాయ విద్యాసంస్థల్లో ఒకటి హైదరాబాద్‌లోని దనల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా అయితే ఈ యూని వర్సిటీ ఇటీవల ఒక పెద్ద వివాదానికి కేంద్రబిందువుగా మారింది. విశ్వవి ద్యాలయ స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సూర్య కాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని కొందరు విద్యా ర్థులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై తాత్కాలిక నిషేధం విధించడం,తర్వాత ఆ నిర్ణయాన్ని బీసీఐ వెనక్కి తీసుకోవడం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. అసలు ఏమిటీ వివాదం? ఎందుకు రచ్చ అవుతోంది?

### -నల్సార్ విశ్వవిద్యాలయంవివాదం ఏంటి?

నల్సార్ విశ్వవిద్యాలయం 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని విశ్వవిద్యాలయ యంత్రా ంగం నిర్ణయించింది. అయితే ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన నిరసనల ప్రభావం ఈ కార్యక్రమంపై పడింది. చీఫ్ జస్టిస్ ను స్నాతకోత్సవానికి ఆహ్వానిం చడాన్ని తప్పుబడుతూ విద్యార్థులలో ఒక వర్గం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఢిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనలు, పోలీసుల అరా చకాలకు సంబంధించిన ఒక పిటిషన్‌ను సుప్రీం కోర్టులో విచారించే సమయంలో సీజేఐ చేసిన కొన్ని మౌఖిక వ్యాఖ్యలే ఈ అసంతృప్తికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. విచారణ సందర్భంగా వీడియో ఆధారాలు సమర్పించగా మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి, వీడియోలు చూడ టానికి మాకు సమయం లేదు అని ధర్మాసనం పేర్కొన్నట్లు ప్రచారం జరిగింది. న్యాయస్థానం బాధితుల ఆవేదనను ఆలకించకుండా ఇలా వ్యాఖ్యానించడం రాజ్యాంగ విలువలకు, ప్రాథమిక హక్కుల రక్షణకు విరుద్ధమని భావిస్తూ దాదాపు 450 మంది విద్యార్థులు ఒక వినతిపత్రాన్ని సిద్ధం చేసి, సీజేఐని స్నాతకోత్సవానికి ఆహ్వానించవద్దని కోరారు.




### -నల్సార్ వివాదంలోకి బార్ కౌన్సిల్ ఆఫ ఇండియా?

హైదరాబాద్ నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులు చేపట్టిన ఈ నిరసన ప్రచారంపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చాలా తీవ్రంగా స్పందించింది. దేశంలోనే అత్యున్నత న్యాయస్థానాన్ని సీజేఐ పదవిని గౌరవిం చని విద్యార్థులు భవిష్యత్తులో బాధ్యతా యుతమైన న్యాయవాదులుగా, న్యాయమూర్తులుగా లేదా చట్ట ఉపాధ్యాయులుగా రాణించలేరని బీసీఐ అభిప్రాయ పడింది. ఇటువంటి ప్రవర్తన న్యాయవాద వృత్తి గౌరవానికి, క్రమశిక్షణకు నైతిక ప్రమాణాలకు భంగం కలిగిస్తుందని బీసీఐ పేర్కొంది. ఈ క్రమంలో బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా ఒక సంచలన ఆదేశాన్ని జారీ చేశారు. 2026 సంవత్సరంలో నల్సార్ నుంచి పట్టా పొందిన విద్యార్థులెవరినీ తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఏ రాష్ట్ర బార్ కౌన్సిల్‌లోనూ న్యాయవాదిగా ఎన్‌రోల్ చేయకూడదని ఆదేశించారు. తప్పుడు ప్రచారాన్ని ఎవరు ప్రారంభించారు, ఎవరు నిర్వహించారు అనే అంశంపై సమగ్ర విచారణ జరిపి 3 రోజుల్లో రిపోర్ట్ సమర్పించాలని నల్సార్ వైస్ ఛాన్సలర్‌ను బీసీఐ ఆదేశించింది.

### -విద్యార్థులపైనే కాదు అధ్యాపకుల పైనా ఆరోపణలు?

నల్సార్ విశ్వవిద్యాలయం విద్యార్థులపైనే కాదు అధ్యాపకులపైనా ఆరోపణలు వస్తున్నాయి. అలాగే బయటి వ్యక్తులు యూనివర్సిటీ విద్యార్థులను రెచ్చగొట్టి రాజకీయాలకు పాల్పడుతున్నారని బీసీఐ అనుమానం వ్యక్తం చేసింది. అయితే మొత్తం బ్యాచ్ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ను నిలిపివేస్తూ బీసీఐ తీసుకున్న తీవ్ర నిర్ణయంపై న్యాయ వర్గాల్లో, సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కొందరు విద్యార్థులు లేదా ఉపాధ్యా యులు చేసిన చర్యకు మొత్తం 2026 బ్యాచ్‌ను శిక్షించడం అన్యాయమని, ఇది వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తుందని పలువురు సీనియర్ న్యాయ వాదులు, చట్ట నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యతిరేకత, కౌన్సిల్ సభ్యుల అంతర్గత చర్చల అనంతరం ఎన్‌రోల్‌మెంట్ ఆదేశా లు జారీ చేసిన కొద్ది గంటల్లోనే బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తన నిర్ణయాన్ని సవరించుకుంది. కౌన్సిల్ సభ్యులందరి ఆమోదంతో తన మునుపటి ఉత్తర్వు లను సవరిస్తూ నూతన ప్రకటన విడుదల చేసింది. నల్సార్ 2026 బ్యాచ్‌లోని అత్యధిక శాతం విద్యార్థులు నిరపరాధులని, సీజేఐని అవమానించే ఉద్దేశం వారికి లేదని తేలింది. ఏ తప్పూ లేని విద్యార్థికి ఎట్టి పరిస్థితు ల్లోనూ అన్యాయం జరగకూ డదు. అందుకే ఎన్‌రోల్ మెంట్ ఆదేశాలను వెనక్కి తీసుకుంటున్నాం. బీసీఐ స్పష్టం చేసింది. దీంతో 2026 నల్సార్ గ్రాడ్యు యేట్లు అందరూ తమకు నచ్చిన ఏ రాష్ట్ర బార్ కౌన్సిల్ లోనైనా న్యాయవాదులుగా ఎన్‌రోల్ చేసుకోవడానికి పూర్తి అర్హత సాధించారు. దీంతో ఆందోళన చెందుతున్న విద్యార్థు లకు, వారి కుటుంబాలకు పెద్ద ఉపశమనం లభించింది

### -నల్సార్ వివాదంపై కొనసాగుతున్న విచారణ?

న్యాయ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై నిషేధాన్ని ఉపసంహరించుకున్నప్పటికీ నల్సార్ యూనివర్సిటీ వివాదానికి తెర పడలేదు. ఈ వివాదానికి కారణమైన ముఖ్య సూత్రధారులపై విచారణను బీసీఐ నిలిపి వేయలేదు. నల్సార్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవ రావు సమర్పించే వాస్తవ విచారణ రిపోర్ట్ కోసం బీసీఐ వేచి చూస్తోంది. కేవలం వినతిపత్రంపై సంతకం చేసిన సాధారణ విద్యార్థులకు, ఈ నిరసన ప్రచారాన్ని ముందుండి నడిపి రెచ్చగొట్టిన వారికి వ్యత్యాసం ఉంటుందని బీసీఐ తెలిపింది. రిపోర్ట్ వచ్చిన తర్వాత బాధ్యులైన వారిపై మాత్రమే తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది.నల్సార్ స్నాతకోత్సవ వివాదం భారత న్యాయ విద్యా రంగంలో గుర్తుండిపోయే సంఘటనగా మిగిలిపో నుంది.ఒకవైపు విద్యార్థుల భావప్రకటనా స్వేచ్ఛ, విమర్శనాత్మక ఆలోచనా ధోరణి ఎంత కీలకమో గుర్తుచేయగా మరోవైపు అత్యున్నత న్యాయస్థాన గౌరవం, వృత్తిపరమైన క్రమశిక్షణల ప్రాముఖ్యతను ఇది చాటిచెప్పింది.

# క్రిమినల్ మెంటాలిటీకి మతం,కులం,హోదాతో పనిలేదు..!

ఒక సమాజం ఎంత బలంగా ఉందో నిర్ణయించేది దాని చట్టాల పుస్తకాలు ఎంత మందంగా ఉన్నా యన్నది కాదు.ఆ చట్టాలను ఎంత సమానంగా,ఎంత నిష్పక్ష పాత ంగా, ఎంత ధైర్యంగా అమలు చేస్తున్నా మన్నదే. చట్టం ముందు అందరూ సమానమే అనే మాట పుస్తకాల్లో కనిపించడం సులభం.కానీ,అదే సమానత్వం ఒక సామాన్యుడి నుంచి అత్యంత పలుకుబడి ఉన్న వ్యక్తి వరకు ఆచరణలో కనిపిం చినప్పుడే ప్రజలకు న్యాయ వ్యవస్థపై నిజమైన విశ్వాసం ఏర్పడుతుంది.క్రిమినల్ మెంటాలిటీకి మతం లేదు, కులం లేదు, పేదరికం లేదు, సంపద లేదు, హోదా లేదు.అది ఒక వ్యక్తి ఆలోచనా విధాన ంలో, విలువల్లో, స్వార్థంలో,అధికార దుర్విని యోగంలో, బాధ్యతారాహిత్యంలో రూపుదిద్దుకునే నేర ప్రవృత్తి. అందుకే నేరస్తుడిని అతని మతం, కులం, వృత్తి, హోదాతో కొలవడం ఎంత తప్పో..ఒక నేరాన్ని ఆ వ్యక్తి హోదా కారణంగా తక్కువగా చూడడం కూడా అంతే ప్రమాదకరం. ఒక వ్యక్తి ఒక మత దేవాలయంలో అర్చకుడిగా ఉండవచ్చు.ఒక కులానికి పెద్దగా ఉండొ చ్చు. మరొకరు ప్రజల మధ్య ప్రజాప్ర తినిధిగా ఉండవచ్చు. ఇంకొకరు ఏసీ రూములో ప్రభుత్వ అధికారి కావచ్చు. పోలీసు అధికారి కావచ్చు.వైద్యుడు కావచ్చు. న్యాయవాది కావచ్చు.ఏ వృత్తిలో ఉన్నా నేరం నేరమే.యూనిఫాం మారితే నేర స్వభావం మారదు. హోదా పెరిగితే తప్పు చిన్నది కాదు.

### -ఇక్కడే అసలు సమస్య మొదలవుతుంది

ఒక సామాన్యుడు నేరం చేస్తే చట్టం వేగంగా కదులుతుంది. కానీ,నేటి సమాజంలో పలుకుబడి, అధికారం లేదా ఆర్థిక బలం ఉన్న వ్యక్తిపై ఆరోపణలు వచ్చినప్పుడు అదే వ్యవస్థ నెమ్మదిస్తే..ప్రజల మనసులో ఒక ప్రమాదకరమైన భావన ఏర్పడు తుంది."చట్టం అందరికీ సమానం కాదు" అనే భావన. అది ఒక్క కేసుకు సంబంధించిన నష్టం కాదు. అది మొత్తం వ్యవస్థపై పడే మచ్చ. విచారణ ఆలస్యం కావడం, కేసులు సంవత్సరాల తరబడి సాగడం, సాక్షులపై ప్రభావం పడటం, బాధితులు న్యాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరగడం వంటి పరిస్థితులు ఏర్పడితే.. నేరస్తుడికి శిక్ష పడకపోవడమే కాకుండా సమాజానికి ఒక తప్పుడు సందేశం వెళ్తుంది."పలుకుబడి ఉంటే తప్పించు కోవచ్చు. అధికారం ఉంటే చట్టాన్ని ఆలస్యం చేయిం చవచ్చు.డబ్బు ఉంటే న్యాయాన్ని ప్రభావితం చేయవచ్చు." ఈ భావన సమాజంలో బల పడితే. .చట్టం పట్ల భయం మాత్రమే కాదు,న్యాయం పట్ల గౌరవం కూడా క్రమంగా క్షీణిస్తుంది.

### -నేరం కంటే నేరాన్ని కాపాడే వ్యవస్థ ప్రమాదకరం

ఒక వ్యక్తి నేరం చేయడం సమాజానికి ప్రమాదమే. కానీ,నేరం చేసిన వ్యక్తిని వ్యవస్థలోని ఎవరైనా కాపాడటం, విచారణను ప్రభావితం చేయడం లేదా బాధితుడికి న్యాయం ఆలస్యం చేయడం మరింత ప్రమాదకరం. ఎందుకంటే ఒక నేరస్తుడిని శిక్షిస్తే ఒక నేరం ఆగుతుంది. కానీ,నేరస్తుడిని వ్యవస్థ కాపాడుతుందనే నమ్మకం ఏర్పడితే..వందల మందిలో నేరానికి ధైర్యం పెరుగు తుంది.అందుకే వ్యవస్థలోని ప్రతి అడ్డుగోడ బలంగా ఉండాలి.పోలీసు దర్యాప్తు స్వతంత్రంగా ఉండాలి. ఆధారాలు సేకరించే విధానం పారదర్శకంగా ఉండాలి. రాజకీయ,సామాజిక,ఆర్థిక ఒత్తిళ్లకు దర్యాప్తు సంస్థలు లొంగకూడదు.న్యాయ ప్రక్రియ వేగంగా, నిష్పక్షపాతంగా సాగాలి. అయితే ఆరోపణ వచ్చిన -ప్రతి వ్యక్తి నేరస్తుడేనా?ఇదీ మనం మర్చిపోకూడని మరో ముఖ్యమైన సత్యం. ఆరోపణ వచ్చినంత మాత్రాన ఒక వ్యక్తిని నేరస్తుడిగా ముద్ర వేయడం కూడా న్యాయం కాదు. న్యాయమైన విచారణ,సాక్ష్యాలు, చట్టబద్ధమైన ప్రక్రియ, చివరకు న్యాయస్థానం తీర్పు అవసరం.బాధితుడికి రక్షణ, న్యాయం ఎంత ముఖ్యమో.. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి న్యాయమైన విచారణ హక్కు కూడా అంతే ముఖ్యం. న్యాయం అంటే ఎవరో ఒకరిని శిక్షించడం మాత్రమే కాదు.నిజాన్ని వెలికితీసి, దోషికి శిక్ష విధించడం నిర్దోషికి రక్షణ కల్పించడం.ఈ సమతుల్యతే న్యాయవ్య వస్థకు అసలైన బలం. అధికారం ఉన్నవారికి బాధ్యత కూడా ఎక్కువే.ప్రజాస్వామ్యంలో పదవి అనేది ప్రత్యేక హక్కు కాదు, ప్రత్యేక బాధ్యత.ప్రజాప్రతినిధి ఒక నిర్ణయం తీసుకుంటే వందల,వేల కుటుంబాలపై ప్రభావం పడవచ్చు. అధికారి ఒక ఫైల్‌పై సంతకం చేస్తే ఒకరి జీవితం మారవచ్చు.పోలీసు అధికారి తీసుకునే నిర్ణయం ఒకరి స్వేచ్ఛను ప్రభావితం చేయవచ్చు. వైద్యుడి నిర్లక్ష్యం ఒక ప్రాణాన్ని ప్రమాదంలోకి నెట్టవచ్చు.అందుకే అధికారం పెరిగిన కొద్దీ నైతిక బాధ్యత కూడా పెరగాలి.హోదా మనిషిని చట్టానికి పైన నిలబెట్టడానికి కాదు.చట్టాన్ని మరింత బాధ్యతగా పాటించడానికి. సమాజం కూడా బాధ్యత వహించాలి.ప్రతి తప్పుకు ప్రభుత్వాన్ని,పోలీసులను, న్యాయస్థానాలను మాత్రమే ప్రశ్నించడం సరిపోదు.తప్పును చూసి మౌనం వహించే సమాజం కూడా తన పాత్రను పరిశీలించుకోవాలి.మనకు నచ్చిన వ్యక్తి తప్పు చేస్తే సమర్థించడం నచ్చని వ్యక్తి అదే తప్పు చేస్తే ఖండించడం న్యాయం కాదు.తప్పు చేసిన వ్యక్తి మనవాడైనా, పరాయివాడైనా తప్పును తప్పుగానే చూడగలిగినప్పుడు మాత్రమే నిజమైన న్యాయస్ఫూర్తి ఏర్పడుతుంది.మతం పేరుతోనో, కులం పేరుతోనో,పార్టీ పేరుతోనో, హోదా పేరుతోనో నేరాన్ని సమర్థించడం సమాజానికి చేసే పెద్ద ద్రోహం.

### -అసలు పోరాటం ఎక్కడ ఉండాలి?

అసలు పోరాటం ఏ మతంపై కాదు, ఏ కులంపై కాదు,ఏ వృత్తిపై కాదు.ఏ రాజకీయ పార్టీపై కాదు.పోరాటం నేర ప్రవృత్తిపై ఉండాలి.పోరాటం అధికార దుర్వినియోగంపై ఉండాలి. పోరాటం అవినీతిపై ఉండాలి. పోరాటం చట్టాన్ని బలహీనపరిచే వ్యవస్థాగత లోపాలపై ఉండాలి .ఒక పోలీసు నిజాయితీగా పనిచేస్తే ప్రజలకు పోలీసులపై నమ్మకం పెరుగుతుంది.ఒక అధికారి ఒత్తిళ్లకు లొంగ కుండా పనిచేస్తే ప్రభుత్వంపై విశ్వాసం పెరుగు తుంది. ఒక న్యాయస్థానం నిష్పక్షపాతంగా తీర్పు ఇస్తే ప్రజాస్వామ్యంపై నమ్మకం బలపడుతుంది.అదే విధంగా ఒక నేరస్తుడిని అతని హోదా కారణంగా కాపాడితే..ఆ నష్టం ఒక్క కేసుకే పరిమితం కాదు. అది మొత్తం వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. చివరికి మనం గుర్తుంచుకోవాల్సింది ఒక్కటే చట్టం బలహీనుడికి మాత్రమే కాదు..బలవంతుడికి కూడా వర్తించాలి. నేరస్తుడికి మతం ఉండదు,నేరానికి కులం ఉండదు, అవినీతికి పార్టీ రంగు ఉండదు, అధికార దుర్వినియో గానికి హోదా అడ్డుకాదు. అందుకే మనం వ్యక్తిని చూసి చట్టాన్ని మార్చకూడదు. చట్టాన్ని చూసి వ్యక్తిని అంచనా వేయాలి.వ్యవస్థను కాపాడేది చట్టాలు మాత్రమే కాదు.ఆ చట్టాలను నిజాయితీగా అమలు చేసే మనుషులు.అదే సమయంలో చట్టాన్ని తమ స్వార్థానికి వాడుకునే మనుషులే వ్యవస్థను బలహీనపరచగలరు.అందుకే ప్రతి పౌరుడు తనను తాను ప్రశ్నించుకోవాలి."తప్పు చేసిన వాడు ఎవరు?" అన్నదానికంటే "తప్పు చేసినవాడు ఎవరైనా సరే..చట్టం ముందు నిలబడేలా మన వ్యవస్థ పనిచేస్తుందా?"ఈ ప్రశ్నకు మన సమాజం నిజాయితీగా "అవును" అని సమాధానం చెప్పగలిగిన రోజే.. చట్టం పుస్తకాల్లో ఉన్న పదం కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించే న్యాయంగా మారుతుంది.నేరం చేసే వ్యక్తిని మాత్రమే కాదు..నేరం చేయడానికి ధైర్యం ఇచ్చే పరిస్థితులను కూడా ఎదుర్కొందాం. హోదా కాదు.. న్యాయం ముఖ్యం. పలుకుబడి కాదు

హంస కలం వార్త
HAMSA KALAM VARTA
ఆదివారం 16 ఆగష్టు 2026

# స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా జెండా వందనం కార్యక్రమం

( ఆగస్టు - 15- హంసకలం వార్త )

భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ మండల స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జెండా వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు బ్రహ్మశ్రీ బావోజీ పండరి చారి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పండరి చారి ని కుత్బుల్లాపూర్ మండల స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా, అల్వాల్ మండల స్వర్ణకార సంఘం అధ్యక్షులు కే. ప్రభాకర్ చారి మరియు వారి కార్యవర్గ సభ్యులను, అలాగే జగద్గిరిగుట్ట స్వర్ణకార సంఘం అధ్యక్షులు ప్రభు సత్యనారాయణ చారి మరియు వారి కార్యవర్గ సభ్యులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. వారి ఆహ్వానాన్ని మన్నించి వారు ఈ జెండా వందనం కార్యక్రమంలో పాల్గొని



కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ మండల స్వర్ణకార సంఘం అధ్యక్షులు చొల్లేటి శ్రీనివాస్ చారి., ముఖ్య సలహాదారు వి. భాస్కర చారి , లీగల్ అడ్వైజర్ అద్దంకి వెంకటాచారి , పరిపాలన సలహాదారుడు గుండవెల్లి నాగేశ్వర చారి , ప్రధాన కార్యదర్శి నారాయణ చారి , కోశాధికారి శ్రీరామోజు మురళీధర్ చారి , మాజీ కోశాధికారి రమేష్ చారి , ఆర్. శ్రీహరి చారి , ఆర్. చంద్రశేఖర్ చారి , ఎర్ర వెల్లి శ్రీకాంత్ చారి , దూలపల్లి మహేష్ చారి ,



కొండోజు రంగాచారి , కొండోజి లక్ష్మణ చారి , బి రామబ్రహ్మం స్వర్ణ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల స్వర్ణకార సంఘాల నాయకులు, కార్యవర్గ సభ్యులు, సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాకు వందనం సమర్పించారు. దేశభక్తి, ఐక్యత, సామాజిక సేవా భావాలతో స్వర్ణకార సంఘాన్ని మరింత బలోపేతం చేసి, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.
కుత్బుల్లాపూర్ మండల స్వర్ణకార సంఘం మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లా

# బస్ భవన్ లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు







**-సరిహద్దుల్లో సైనికుల్లాగే... ఆర్టీసీ సిబ్బంది నిజమైన రవాణా యోధులు**
**-డిజిటల్ సేవల వైపు టీజీఎస్ ఆర్టీసీ అడుగులు :**
**- సంస్థ వీసీ అండ్ ఎండీ వై. నాగిరెడ్డి**

( ఆగస్టు - 15- హంస కలంవార్త )

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ ఆర్టీసీ బస్ భవన్ లో టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం అనేది ఉచితంగా వచ్చిన కానుక కాదని, వేలాది మంది అమరవీరుల త్యాగాల ఫలితమని పేర్కొన్నారు. భారతమాత స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవడానికి ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకునే పవిత్రమైన రోజని అన్నారు. దేశ పురోగతిలోనూ, ప్రజాజీవన ంలోనూ రవాణా వ్యవస్థల పాత్ర అత్యంత కీలకమైన దని, తెలంగాణ రాష్ట్ర ప్రగతి చక్రంలో టీజీఎస్ ఆర్టీసీ ఒక ప్రధాన శక్తిగా నిలుస్తూ రోజూ లక్షలాది మంది ప్రజలను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుస్తోందని ఎండీ వెల్లడించారు. సరిహద్దుల్లో సైనికులు దేశాన్ని కాపాడుతుంటే, రోజూ వేకువజా మునే లేచి ఎండనక, వాననక కోట్లాది మంది ప్రజలను చేరవేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ మెకానిక్‌లు, ఇతర సిబ్బందే నిజమైన రవాణా యోధులని ఆయన ప్రశంసిం చారు. సంస్థ పట్ల ప్రజలు చూపుతున్న నమ్మకమే ఆర్టీసీకి నిజమైన బలమని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ఆర్టీసీ అత్యంత విజయ వంతంగా అమలు చేస్తోందని ఆయన తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం తో పాటు విద్యార్థు లకు, దివ్యాంగులకు ఉచిత, రాయితీ పాస్‌లు అంది స్తూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదిగేం దుకు ఆర్టీసీ ఒక శక్తివంతమైన సాధనంగా మారిం దన్నారు. మారే కాలానికి అనుగుణంగా ఆర్టీసీని ఆధునిక, పర్యావరణహిత వ్యవస్థగా తీర్చిదిద్దుతున్నా మని నాగిరెడ్డి స్పష్టం చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం యూపీఐ, కార్డు చెల్లింపుల వంటి డిజిటల్ సేవలతో పాటు లైవ్ బస్ ట్రాకింగ్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. మహిళల భద్రతకు ప్రాధాన్య మిస్తూ బస్సుల్లో సీసీటీవీ కెమెరాలు, పానిక్ బటన్ల ఏర్పాటును వేగవంతం చేశామని వివరించారు. కాలుష్య నివారణ కోసం భారీగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతూనే, పాత బస్సుల స్థానంలో కొత్త సూపర్‌లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులను తీర్చిదిద్దు తున్నట్లు చెప్పారు. సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, విస్తృతమైన మొక్కల పెంపకంతో 'గ్రీన్ ఆర్టీసీ' దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. గ్రామీణ కనెక్టివిటీని బలోపేతం చేస్తూనే, కార్గో మరియు లాజిస్టిక్స్ సేవల ద్వారా సంస్థ ఆదాయ మార్గాలను పెంచుకుంటున్నామని వెల్లడిం చారు. సంస్థ అభివృద్ధిలో భాగస్వాము లవు తున్న సిబ్బంది శ్రేయస్సే యాజమాన్యానికి అత్యంత ప్రాధాన్యమైన అంశమని ఎండీ పేర్కొన్నారు. ఉచిత ఆరోగ్య పరీక్షలు, వైద్య శిబిరాల ద్వారా ఉద్యోగుల ఆరోగ్యాన్ని సంరక్షిస్తూ, ప్రమాద రహితంగా బస్సులు నడిపే డ్రైవర్లను, ప్రతిభ చూపిన సిబ్బం దిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ కేవలం ఒక ప్రభుత్వ సంస్థ కాదని, అది అందరి ఆస్తి అని గుర్తు చేస్తూ, ప్రజారవాణాను ప్రోత్సహించడం, బస్సులను, డిపోలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని పిలుపు నిచ్చారు. రాబోయే రోజుల్లో అన్ని ప్రాంతాలకు సేవలను విస్తరించి, ప్రజాసేవలో టీజీఎస్ ఆర్టీసీని దేశంలోనే అగ్రగామిగా నిలబెడతామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ వేడుకల్లో సంస్థ ఈడీలు (ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లు) సిహెచ్.వెంకన్న, ఎం. రాజశేఖర్, ఎఫ్ఏ విజయపుష్ప, జేడీ నర్మద, సిపిఎం ఉషాదేవి, సీఎంఇ జానీరెడ్డి, సిటీఎం శ్రీదేవిలతో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అల్లాపూర్, గాయత్రి నగర్ డివిజన్లలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

( ఆగస్టు-15- హంస కలంవార్త)

అల్లాపూర్ డివిజన్ బీజేపీ నాయకులు సందీప్ నాయక్, గాయత్రి నగర్ డివిజన్ బీజేపీ నాయకులు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ డివిజన్లలోని భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి కార్యకర్తకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని భరోసా



ఇచ్చారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ భారతీయ జనతా పార్టీ నాయకత్వం కార్యకర్తలకు పూర్తి అండగా ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ సమగ్రత, అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు





బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు అందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

( ఆగస్టు -15- హంస కలంవార్త )

ప్రజా సేవే దేశ సేవ.. సమష్టి బాధ్యతతో పనిచేయాలి: కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి మల్కాజ్‌గిరి, ఆగస్టు 15: భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎంసీ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, త్రివర్ణ పతాకానికి గౌరవ వందనం చేశారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించగా అధికారులు, సిబ్బంది దేశభక్తి స్ఫూర్తితో పాల్గొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి తమ జీవితాలను అంకితం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ఈ సందర్భంగా అధికారులు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే మనకు స్వేచ్ఛా భారతదేశం లభించిందని అన్నారు. స్వాతంత్ర్యం మనకు అందించిన ప్రజాస్వామ్య



విలువలు, సమానత్వం, బాధ్యత, సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తమ విధుల్లో, వ్యక్తిగత జీవితంలో ఆచరణలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రజా సేవ కేవలం ఉద్యోగ బాధ్యత మాత్రమే కాదని, దేశం మరియు ప్రజల పట్ల ఉన్న బాధ్యత, నిబద్ధతకు ప్రతీక అని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా అందేలా అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని



కల్పించడం, పచ్చదనాన్ని పెంపొందించడం, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, మౌలిక వసతులను బలోపేతం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని, మున్సిపల్ సేవల విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, సిబ్బంది పాల్గొని జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఒకరికొకరు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

# వివేకానంద నగర్ కాలనీలోని ఓం శాంతి వారి సుఖశాంతి భవన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



( ఆగస్టు - 15- హంస కలంవార్త )



ఈ కార్యక్రమానికి వారి ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడు తూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యా గం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, దేశ ఐక్యత, సమగ్రత మరియు అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు మరియు కాలనీ వాసులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ని ఘనంగా సన్మానించారు. వేడుకల్లో కాలనీ వాసులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వివేకానంద నగర్ డివిజన్ లోని కమల ప్రసన్న నగర్ కాలనీ లో



( ఆగస్టు - 15- హంస కలంవార్త )

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారి ఆహ్వానం మేరకు కాంగ్రెస్ నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు తో కలిసి శాసనసభ్యులు ఆరేకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు వేడుకల్లో కాలనీ వాసులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రిపోర్టర్ మనోహర్ ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధం

**--ప్రమాదంలో రూ.20 లక్షల ఆస్తినష్టం.**
**-- ఇంటిని పరిశీలించి రూ. 5,000/- వేల రూపాయల చెక్కును అందజేసిన అధ్యక్షులు ఎర్ర యాకయ్య, ప్రధాన కార్యదర్శి నాగుల అంజిబాబు.**

( ఆగస్టు - 15- హంస కలంవార్త )



కూకట్ పల్లి త్రినేత్రం రిపోర్టర్ గుండా మనోహర్ ఇల్లు శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇల్లు పూర్తిగా దగ్ధమై సుమారు రూ. 20 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన ఫైర్ ఇంజిన్ తో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మంటలు భారీగా చెలరేగడంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ పూర్తిగా కాలిపోయింది. అదేవిధంగా విలువైన గృహోపకరణాలు మంటల్లో కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉంచిన రెండు తులాల 50 గ్రాముల బంగారు నగలు, 8 తులాల వెండి, రూ.28,000 నగదు, వస్తువులు,బట్టలు, ఫర్నీచర్ ఇంటిలోని సామాగ్రి అంతా మంటల్లో కాలి బూడిదయ్యాయి. ఒంటిపై ఉన్న బట్టలతోనే మిగిలిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనతో నిరుపేద కుటుంబానికి చెందిన మనోహర్ కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ నేపథ్యంలో సంఘటన స్థలానికి కూకట్ పల్లి ప్రెస్ క్లబ్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజేఎఫ్) అధ్యక్షులు ఎర్ర యాకయ్య, ప్రధాన కార్యదర్శి నాగుల అంజిబాబు (జనరల్ సెక్రటరీ) ఇంటిని పరిశీలించి రూ. 5000/- వేల రూపాయల చెక్కును మనోహర్ కి అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఎర్ర యాకయ్య మాట్లాడుతూ జర్నలిస్టు మిత్రులు, బిల్డర్లు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు మానవతా దృక్పథంతో స్పందించి, తమకు తోచిన ఆర్థిక సహాయాన్ని పంపించి రిపోర్టర్ మనోహర్ కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కావున దాతలు కూకట్ పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అకౌంట్ నెంబర్ : 79086138295, IFSC Code: TGRB0000158 కి ఆర్థిక సాయం అందజేయాలని కోరారు.

హంస కలం వార్త
HAMSA KALAM VARTA


# చెరువును మింగేస్తున్న అక్రమార్కులు.. 'ముడుపుల' మత్తులో జీహెచ్ఎంసీ!

**రామ్ నరేష్ నగర్‌లో యథేచ్ఛగా జీరో పర్మిషన్‌తో భారీ నిర్మాణాలు**
**బఫర్ జోన్‌లో సైతం బహుళంతస్తుల భవనాలు.. పట్టించుకోని బల్దియా**
**ఫిర్యాదులొచ్చినా, వార్తలొచ్చినా చెత్తబుట్టకే.. టౌన్ ప్లానింగ్ ఆమ్యామ్యాలు**
**పాతోళ్లు పోయినా మారని తీరు.. కొత్త అధికారుల 'కొత్త' వసూళ్లు**
**అక్రమ భవనాలను తక్షణమే నేలమట్టం చేయాలంటున్న ప్రజలు**

( ఆగస్టు - 15- హంస కలంవార్త )

ఆల్విన్ కాలనీ, హైదర్ నగర్ పరిధిలోని రామ్ నరేష్ నగర్‌లో భూమాఫియా, అక్రమ నిర్మాణదారుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. నిబంధనలను, చట్టాలను నడిరోడ్డుపై పాతరేస్తూ ఇష్టారాజ్యంగా భారీ బహుళంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా.. జీహెచ్ఎంసీ అధికారుల్లో కనీస చలనం లేకుండా పోయింది. అక్రమార్కుల నుంచి అందుతున్న "భారీ ముడుపుల" మత్తులో టౌన్ ప్లానింగ్ అధికారులు నిలువునా అమ్ముడుపోయారన్న విమర్శలు తీవ్ర స్థాయిలో వెల్లువెత్తుతున్నాయి.

**బఫర్ జోన్‌లో బరితెగింపు.. జీరో పర్మిషన్‌తో నిర్మాణాలు:**

అక్రమార్కుల కన్ను ఏకంగా రామ్ నరేష్ నగర్ చెరువుపై పడింది. సాక్షాత్తూ చెరువు బఫర్ జోన్ పరిధిలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా.. పూర్తిగా జీరో పర్మిషన్‌తో ఓ భారీ అక్రమ భవనం దర్జాగా పైకి లేస్తోంది. పర్యావరణ నిబంధనలను తుంగలో తొక్కుతూ, పబ్లిక్‌గా ఇంత పెద్ద నిర్మాణం జరుగుతున్నా బల్దియా అధికారులు గురక పెడుతున్నారు. గతంలో ఈ అక్రమ భవనాలపై పత్రికల్లో ఎన్ని వార్తా కథనాలు వచ్చినా అధికారుల కళ్లు తెరచుకోకపోవడం వెనుక ఉన్న 'ప్యాకేజీల' మర్మం ఏమిటో అందరికీ అర్థమవుతూనే ఉంది.

**పాతోళ్లు పోయారు.. కొత్త అధికారుల దందా మొదలైంది!**



అక్రమాలను అడ్డుకోవాలని, బఫర్ జోన్‌ను కాపాడాలని స్థానికులు టౌన్ ప్లానింగ్ అధికారులకు పదే పదే ఫిర్యాదులు చేసినా వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఫిర్యాదులు రాగానే బిల్డర్ల వద్దకు వెళ్లి బేరాలు మాట్లాడుకుని.. ఆ కాగితాలను చెత్తబుట్టలో వేస్తున్నారు. ఇక్కడ మరో దారుణం ఏమిటంటే.. అవినీతి ఆరోపణలతో పాత అధికారులు బదిలీ అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. వారి స్థానంలో వచ్చిన కొత్త అధికారులు సైతం "పాతోళ్లు పోయారు.. మాకు కొత్త కాసులు కావాలి" అన్నట్లుగా వసూళ్ల దందా మొదలుపెట్టారు. చేతులు తడపడమే తరువాయి.. అక్రమ నిర్మాణాలకు అడ్డు లేకుండా పోతోందని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**తక్షణమే కూల్చివేయాలి.. అధికారులను సస్పెండ్ చేయాలి!**

రామ్ నరేష్ నగర్ బఫర్ జోన్‌లో, ఇతర ప్రాంతాల్లో వెలుస్తున్న ఈ జీరో పర్మిషన్ నిర్మాణాలపై జోనల్ కమిషనర్, హైడ్రా ఉన్నతాధికారులు తక్షణమే కొరడా ఝుళిపించాలి. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ భవనాలను తక్షణమే సీజ్ చేసి, బుల్డోజర్లతో నేలమట్టం చేయాలి. అక్రమాలకు వత్తాసు పలుకుతూ, ఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారుల ఫోన్ కాల్స్, ఆస్తులపై విజిలెన్స్ విచారణ జరిపి వారిని విధుల నుంచి సస్పెండ్ చేయాలి.

అధికారులు ఇకనైనా నిద్రలేచి చర్యలు తీసుకోకపోతే జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, ఈ అవినీతి బాగోతాన్ని ఉన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.









## కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



(ఆగస్టు-15- హంస కలంవార్త )

పలు డివిజన్లలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన జనసేన నాయకులు ముమ్మారెడ్డి ప్రేమకుమార్ భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పాల్గొని త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు. మోతీనగర్, గాయత్రి నగర్, జనసేన పార్టీ కార్యాలయం (5వ ఫేజ్), బాలాజీనగర్ డివిజన్‌లోని టెంపుల్ బస్‌స్టాప్, బాలానగర్, బోయిన్‌పల్లి, ఫతేనగర్, భారత్‌నగర్, అల్లాపూర్ డివిజన్లలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల్లో ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపిస్తూ దేశభక్తిని చాటుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుని, దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసిన ముమ్మారెడ్డి ప్రేమకుమార్.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని అన్నారు. యువత దేశ నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన నాయకులు, వివిధ డివిజన్ల నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో ఆయా ప్రాంతాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.

## హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా 198వ వారం అన్నదాన కార్యక్రమం



(ఆగస్టు-15- హంస కలంవార్త )





ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కంటే గొప్ప సేవ లేదు: హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ చందానగర్, ఆగస్టు 15: హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం 198వ వారానికి చేరుకుంది. ఈ సందర్భంగా చందానగర్ గంగారంలోని హోప్ ఫౌండేషన్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పేదలు, వృద్ధులు, కూలీలకు స్వయంగా అన్నప్రసా దాలను వడ్డించారు. ఈ సందర్భంగా సుమారు 3,000 మందికి వేడి వేడి భోజనం పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమంలో అన్నం, సాంబారు, కూర, పెరుగు తదితర వంటకాలను వడ్డించారు. ఈ సందర్భంగా కొండ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. "ఆకలితో ఉన్నవా రికి అన్నం పెట్టడం కంటే గొప్ప సేవ లేదు. గత 198 వారాలుగా ఎలాంటి ఆటంకం లేకుండా ఈ సేవ కొనసాగడం హోప్ ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్ల అంకితభావానికి నిదర్శనం" అని అన్నారు. సమా జంలో ఆర్థికంగా వెనుకబడిన వారు, వృద్ధులు, కూలీలు, నిరుపే దలకు ఆహారం అందించాలనే సంకల్పంతో అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రతి వారం అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా అన్నదాన సేవను మరింత విస్తృతంగా కొనసాగించి అవసరమైన వారికి అండగా నిలుస్తామని విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని హోప్ ఫౌండేషన్ ప్రతినిధులు, సభ్యులు, వాలంటీర్లు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు.

# ప్రజలకు మరింత చేరువగా రేషన్ సేవలు.. కలెక్టర్








( ఆగస్టు -15- హంస కలంవార్త)

ప్రజలకు సులభతరమైన స్మార్ట్ రేషన్ కార్డ్ ఫిజికల్ గానే కాకుండా, డిజిటల్ గా కూడా ఇంట్లో ఉన్న మహిళల పేరు మీదనే అందించాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. శనివారం శామీర్ పేట్ మండలంలోని అంతాయి పల్లిలోని ఎస్ ఎన్ ఆర్ వేద్ కన్వేన్షన్ హాల్ లో జిల్లా సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ మను చౌదరి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమం మొదలుపెట్టి సంక్షేమ పథకాలన్నీ కూడా ప్రజలకి అందాలి, చేరువ కావాలి అన్న ఒక ఆలోచన చేసినప్పుడు ప్రతి ఒక్క గ్రామంలో, ప్రతి ఒక్క మున్సిపాలిటీలో ప్రజల దగ్గర నుంచి వారు ఏ ఏ స్కీమ్ లో లబ్ధి కోరుతున్నారనే విషయాన్ని తెలుసుకొని, అందుకనుగుణంగా వారి కోసం సంక్షేమ పథకాల రూపకల్పన చేయడం జరింగిందన్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి మున్సిపాలిటీ వార్డు స్థాయిలో గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారులందరికి లబ్ధి చేకూర్చాలన్నదే ప్రభుత్వ లక్షమన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటివరకు 1,39,622 కొత్త రేషన్ కార్డుల ద్వారా 6 కిలోల చొప్పున సన్న బియ్యం తీసుకుంటున్నారన్నారు. జిల్లాలో సుమారు ప్రతి నెల 14 నుంచి 15 వేల టన్నుల సన్న బియ్యం ప్రజలకు అందిస్తున్నామన్నారు. రేషన్ షాపుల ద్వారా ప్రజలకే కాకుండా రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్ లో ఒక కామన్ డైట్ మెనూ పెట్టి సన్న బియ్యంతోటే పౌష్టికారారం వండి విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డ్స్ లో ముందువైపు రేషన్ కార్డ్ నంబర్, మీ పేరు, కింద రేషన్ షాప్ నంబర్ ఉంటుందని, వెనక వైపు మీ మండలం, జిల్లా, రాష్ట్రము అడ్రస్ తో పాటు పైన ఒక క్యూఆర్ కోడ్ ( క్యూఆర్ కోడ్ ) ఉందన్నారు. మొబైల్ లో మీరు ఆ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే మీకు వివరాలు తెలుస్తాయన్నారు. టి - రేషన్ మొబైల్ యాప్ ను డౌన్‌లోడ్ చేసుకుంటే అందులో క్యూఆర్ కోడ్ సెలెక్ట్ చేస్తే ఇంట్లో ఎంతమంది సభ్యులు ఉన్నారు, ఎంత రేషన్ తీసుకున్నారు, దేనికి తీసుకున్నారు, రేషన్ షాప్ ఎక్కడ ఉంది, డిటైల్స్ మొత్తం మీకు ఆ యాప్ లోనే కనపడతాయని తెలిపారు. మీరు ఫిజికల్ రేషన్ కార్డ్ మర్చిపోయిన మొబైల్ లో ఉన్న డిజిటల్ రేషన్ కార్డ్ లోని క్యూఆర్ కోడ్ ద్వారా రేషన్ పొందవచ్చాన్నారు. కొత్త రేషన్ కార్డ్స్ కోసం ఎప్పుడైన దరఖాస్తు చేసుకోవచ్చని ఇదొక నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్ధులు అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ ఛైర్మన్ నర్సింహులు యాదవ్, గ్రంధాలయ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టిఏ కమిటి సభ్యులు జైపాల్ రెడ్డి, టిజిఎల్డిఎ ఛైర్మన్ చరణ్ కౌషిక్, ఎల్లంపేట్, అలియాబాద్, మూడుచింతలపల్లిల మున్సిపల్ ఛైర్మన్లు, కీసర ఆర్డిఓ వెంకట్ రెడ్డి, తహాసీల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో ఘనంగా రవీందర్ జన్మదిన వేడుకలు

( ఆగస్టు -15- హంస కలంవార్త )

చందానగర్‌లోని హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ సభ్యుడు రవీందర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ కేక్ కట్ చేసి స్నేహితులు, శ్రేయోభిలాషుల మధ్య తన జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయకుమార్, విజయభాస్కర్, మల్లేష్, విష్ణుమూర్తి, పీటర్ తదితరులు పాల్గొని రవీందర్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రవీందర్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.





ఈ సందర్భంగా రవీందర్‌కు పలువురు స్నేహితులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఖైతలాపూర్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





(ఆగస్టు -15- హంస కలంవార్త )
వసుంధర హాస్పిటల్ వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ -- భారీ బైక్ ర్యాలీకి శ్రీకారం చుట్టిన వడ్డేపల్లి రాజేశ్వరరావు ఖైతలాపూర్ డివిజన్ పరిధిలోని వసుంధర హాస్పిటల్ వద్ద 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. డివిజన్ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి జాతీయ గీతాలాపన నిర్వహించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ దేశభక్తి భావనలను చాటుకున్నారు. అదేవిధంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, అలాగే 'వందేమాతరం' గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖైతలాపూర్ డివిజన్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని వడ్డేపల్లి రాజేశ్వర రావు ప్రారంభించారు. అనంతరం ఆయన స్వయంగా ర్యాలీలో పాల్గొని యువతను ఉత్సాహ పరిచారు. పెద్ద సంఖ్యలో యువత పాల్గొనడంతో దేశభక్తి నినాదాల మధ్య బైక్ ర్యాలీ ఉత్సాహ భరితంగా సాగింది. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, "నేటి యువతే రేపటి భారతదేశ భవిష్యత్తు. యువత మాదకద్రవ్యాలు, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి 'నషా ముక్త్ భారత్' పిలుపును ఆదర్శంగా తీసుకుని మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలకు తాము దూరంగా ఉండటమే కాకుండా, వాటికి బానిసైన వారిని కూడా ఆ చెడు అలవాట్ల నుంచి బయటపడేలా చైతన్యం కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశ యువతను కాపాడుకోవడం, దేశ భవిష్యత్తును భద్రపరచడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖైతలాపూర్ డివిజన్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





( ఆగస్టు -15 హంస కలంవార్త )
ఈ గర్వించదగిన దేశభక్తి పర్వదిన సందర్భంగా, బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి రవి కుమార్ యాదవ్ ప్రత్యేక అతిథిగా విచ్చేసి, మనతో కలిసి ఈ చిరస్మరణీయమైన రోజును జరుపుకోవడం ఎంతో గర్వకారణం. ఈ రోజు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బిజెపి డివిజన్ అధ్యక్షులు బాలు యాదవ్ నాయకత్వంలో కార్యక్రమాన్ని నిర్వహించి, ఈ కార్యక్రమంలో నూతన బాధ్యతలను ప్రకటించాము. నూతనంగా నియమితులైన బీజేవైఎం డివిజన్ 248 కార్యవర్గ సభ్యులు -- శేరిలింగంపల్లి నియోజకవర్గం ఈ కార్యక్రమం బీజేవైఎం డివిజన్ అధ్యక్షులు రవి కుమార్ యాదవ్ నాయకత్వంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా బీజేవైఎం డివిజన్ 248 నూతన కార్యవర్గం మరియు కమిటీ సభ్యులను గర్వంగా ప్రకటించాము. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రతి కార్యవర్గ సభ్యునికి హృదయపూర్వక అభినందనలు. మీ కొత్త బాధ్యతల్లో మీరు గొప్ప విజయాలు సాధించాలని, మరింత శక్తి మరియు ఉత్సాహంతో ప్రజాసేవ చేయాలని ఆకాంక్షిస్తున్నాము.

`ఉపాధ్యక్షులు: సోడా అనిల్ కుమార్
-ప్రధాన కార్యదర్శి -- 1: పి. రాహుల్ రాజ్
-ప్రధాన కార్యదర్శి -- 2: కరణ్
-కోశాధికారి: ఆనంద్
-కార్యదర్శి: టి. శ్రీనివాస్
-సోషల్ మీడియా కన్వీనర్: జి. సంతోష్ కుమార్
-కార్యదర్శి: సునీల్ కుమార్ యాదవ్
-ఎగ్జిక్యూటివ్ సభ్యులు: అనూప్ కుమార్
-ఎగ్జిక్యూటివ్ సభ్యులు: ఆకాష్ గౌడ్
-కమిటీ సభ్యులు: రోషన్ కుమార్
-కమిటీ సభ్యులు: సాయి కుమార్

మన సంకల్పం -- మన బాధ్యత
ఏ సంస్థకైనా బలం దాని ఐక్యత, క్రమశిక్షణ, అంకితభావం మరియు కార్యకర్తల సేవా స్ఫూర్తిలో ఉంటుంది. ఈ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా, ఘనంగా మరియు చిరస్మరణీయంగా మార్చేందుకు హాజరైన గౌరవనీయ నాయకులు, జిల్లా నాయకులు, పార్టీ సభ్యులు, కార్యకర్తలు, బీజేవైఎం సభ్యులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, మద్దతుదారులు మరియు ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

# గంజాయి ముఠాతో ఎస్సై, కానిస్టేబుళ్ల దోస్తాన్?



( ఆగస్టు -15- హంస కలంవార్త)
ఈగల్ టీం రైడ్‌లో నిందితుల ఎదురుదాడి.. 14.5 కిలోల గంజాయి స్వాధీనం పోలీసులపై కుక్కలను ఉసిగొల్పి, స్క్రూడ్రైవర్‌తో దాడికి యత్నం స్థానిక పోలీసులతో గంజాయి ముఠాకు సంబంధాలున్నట్లు దర్యాప్తులో వెల్లడి 203 మంది కస్టమర్లు.. 100 మందికి పరీక్షలు, 72 మందికి పాజిటివ్‌గా సమాచారం హైదరాబాద్: బాలానగర్‌లో గంజాయి విక్రయిస్తున్న ముఠాపై ఈగల్ టీం పోలీసులు దాడి చేసిన ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు దాడి చేయగా నిందితులు కుక్కను ఉసిగొల్పడంతో పాటు స్క్రూడ్రైవర్‌తో పోలీసులపై దాడికి యత్నించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో నలుగురిని అరెస్ట్ చేసి సుమారు 14.5 కిలోల గంజాయి, ఎయిర్‌గన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. బాలానగర్‌లోని వినాయక్‌నగర్ శ్మశానవాటిక సమీపంలో నివసిస్తున్న పాడేరు ప్రాంతానికి చెందిన దుర్గాప్రసాద్, కిరణ్, కమలాకర్ అనే ముగ్గురు అన్నదమ్ములు గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఒడిశా ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి వాట్సాప్, డెడ్‌డ్రాప్ విధానంలో కస్టమర్లకు సరఫరా చేస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించారు.

**పోలీసులపై ఎదురుదాడి**

పక్కా సమాచారంతో ఈగల్ టీం పోలీసులు ఇంటిపై దాడి చేయగా.. పోలీసులను చూసిన నిందితులు మొదట కుక్కను వారి మీదకు వదిలినట్లు సమాచారం. అనంతరం స్క్రూడ్రైవర్‌తో పోలీసులపై దాడికి ప్రయత్నించినట్లు అధికారులు తెలిపారు. మరో నిందితుడు భవనం పైకి వెళ్లి పొరుగింటి భవనంపైకి దూకి తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం. అతడు అక్కడ సెల్ఫీ వీడియో తీసుకుంటూ కిందికి దూకుతానని బెదిరించినట్లు పోలీసులు వెల్లడించారు. చివరకు కిందికి దూకడంతో అతడికి రెండు కాళ్లకు గాయాలైనట్లు తెలుస్తోంది.

**పోలీసులతో సన్నిహిత సంబంధాలా?**

నిందితులను విచారించిన సమయంలో బాలానగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కొందరు సిబ్బందితో వారికి సన్నిహిత సంబంధాలున్నట్లు వెలుగులోకి వచ్చినట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. ఈగల్ టీం దాడికి కొద్దిసేపటి ముందే ఓ కానిస్టేబుల్ నిందితుల ఇంటికి వచ్చి వెళ్లినట్లు కూడా దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. నిందితుల ఇంట్లో పోలీసులకు సంబంధించిన వైర్‌లెస్ కమ్యూనికేషన్ పరికరం లభించిందన్న సమాచారం కూడా కలకలం రేపుతోంది.
పోలీసు సిబ్బందితో నిందితులకు ఏ స్థాయిలో సంబంధాలు ఉన్నాయి? గంజాయి దందా గురించి వారికి ముందే సమాచారం ఉందా? దాడుల సమాచారం నిందితులకు చేరేదా? అనే అంశాలపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**203 మంది కస్టమర్లు**

నిందితుల ఫోన్లు, ఇతర సమాచారాన్ని పరిశీలించిన పోలీసులు సుమారు 203 మంది కస్టమర్లను గుర్తించినట్లు తెలిపారు. వారిలో 100 మందిని పరీక్షించగా 72 మందికి గంజాయి వినియోగానికి సంబంధించిన పరీక్షల్లో పాజిటివ్‌గా వచ్చినట్లు స్థానిక నివేదికల్లో పేర్కొన్నారు. అయితే మరో నివేదికలో 74 మందికి పాజిటివ్‌గా వచ్చినట్లు పేర్కొనడంతో అధికారిక తుది సంఖ్యపై స్పష్టత రావాల్సి ఉంది.



**డెడ్‌డ్రాప్ విధానంలో విక్రయాలు**

ఈ ముఠా నేరుగా కస్టమర్లకు గంజాయి ఇవ్వకుండా 'డెడ్‌డ్రాప్' విధానాన్ని అనుసరించినట్లు ఈగల్ అధికారులు వెల్లడించినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా పేర్కొంది. కస్టమర్‌కు గంజాయి ఉంచిన ప్రదేశం, దాని ఫొటోను పంపించి అక్కడి నుంచి తీసుకెళ్లేలా చేసేవారని సమాచారం. దీంతో నిందితులను పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారినట్లు తెలుస్తోంది. గంజాయి ముఠాపై దాడితో ప్రారంభమైన ఈ కేసు.. ఇప్పుడు స్థానిక పోలీసులతో నిందితులకు ఉన్నట్లు చెబుతున్న సంబంధాల కోణంలోనూ ప్రాధాన్యత సంతరించుకుంది. పోలీసు సిబ్బందిపై వచ్చిన ఆరోపణలు దర్యాప్తులో ఎంతవరకు నిజమో తేలాల్సి ఉంది. పూర్తి స్థాయి విచారణ అనంతరం అసలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# మాయమాటలతో బంగారం స్వాహా!




ఆగస్టు -15- హంస కలంవార్త :
హైదరాబాద్‌లో సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని మహిళలను మోసం చేస్తున్న ఇద్దరు పాత నేరస్థులను పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ ద్వారా మహిళలతో పరిచయం పెంచుకుని.. ఖరీదైన కార్లు, విలాసవంతమైన జీవితం పేరుతో నమ్మించి వారి నుంచి బంగారు ఆభరణాలు తీసుకుని పరారవుతున్నట్లు పోలీసులు గుర్తించారు. మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లాకు చెందిన సాగర్ చౌదరి అలియాస్ సాయి సునీల్, భరత్‌కుమార్ స్నేహితులు. గతంలోనూ పలు నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చిన వీరిద్దరూ సులభంగా డబ్బు సంపాదించేందుకు మహిళలను లక్ష్యంగా చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇందుకోసం ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వంటి సోషల్ మీడియా యాప్‌లలో మహిళలతో పరిచయం పెంచుకునేవారు. అనంతరం చాటింగ్ చేస్తూ వారిని ఆకట్టుకుని.. నేరుగా కలిసేందుకు ఒప్పించేవారు. మహిళలను కలిసే ముందు రెండు ఖరీదైన కార్లను అద్దెకు తీసుకుని, ఖరీదైన దుస్తులు ధరించి తాము కోటీశ్వరులమన్నట్లు బిల్డప్ ఇచ్చేవారు. మహిళలను ఖరీదైన రెస్టారెంట్లకు తీసుకెళ్లి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలను గమనించేవారు. అనంతరం ఆ ఆభరణాలు చాలా తక్కువగా ఉన్నాయంటూ నమ్మించే ప్రయత్నం చేసేవారు. తమ వద్ద ఉన్న బంగారం ఇస్తే.. దానికి రెట్టింపు విలువైన కొత్త ఆభరణాలు తయారు చేయించి ఇస్తామని మాయమాటలు చెప్పేవారు. వారి మాటలను నమ్మిన మహిళలు ఆభరణాలను అప్పగించిన వెంటనే నిందితులు అక్కడి నుంచి ఉడాయించేవారు. ఇలా పలువురు మహిళలను మోసం చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇటీవల అందిన ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించిన పేట్‌బషీరాబాద్ పోలీసులు నిందితుల కదలికలపై నిఘా పెట్టి వారి ఆట కట్టించారు. ఇప్పటివరకు సుమారు 20 మంది మహిళల నుంచి దాదాపు 40 తులాల బంగారాన్ని మోసపూరితంగా తీసుకుని విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## పోలీస్ అధికారుల పేర్లతో మోసం.. రూ.23.91 లక్షలు వసూలు



ఆగస్టు -15- హంస కలంవార్త :
కీసరలో పోలీస్ అధికారుల పేర్లు, హోదాలను అడ్డుపెట్టుకుని ప్రజలను మోసం చేస్తూ డబ్బులు వసూలు చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను అలగోలు శ్రీధర్, అలగోలు నందినిగా గుర్తించారు. ఈ కేసు వివరాలను జవహర్‌నగర్ ఏసీపీ చక్రపాణి శుక్రవారం కీసర పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితులు తమకు పోలీస్ శాఖలో పరిచయాలు ఉన్నాయని, పోలీస్ అధికారులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెబుతూ బాధితులను నమ్మించేవారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, కేసుల్లో సహాయం చేస్తామని, ఆస్తి వివాదాలను పరిష్కరిస్తామని చెప్పి పలువురి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. 2020లో బ్యాంకు రుణానికి సంబంధించిన వ్యవహారంలో సహాయం చేస్తానని చెప్పి శ్రీధర్ ఓ వ్యక్తి నుంచి రూ.4.50 లక్షలు తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం పలువురు పోలీస్ అధికారులు, ప్రముఖ వ్యక్తులతో తనకు పరిచయాలు ఉన్నట్లు చూపిస్తూ బాధితుల్లో మరింత నమ్మకం కలిగించినట్లు తెలిపారు.మరో ఘటనలో తాను పోలీస్ అధికారినని పరిచయం చేసుకుని సివిల్ కేసులు, ఆస్తి వివాదాల్లో సహాయం చేస్తానని చెప్పి పలువురి నుంచి డబ్బులు తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. యూపీఐ, ఫోన్‌పే ద్వారా రూ.5,42,417 వరకు నగదు బదిలీ చేయించుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇలా బాధితుల నుంచి మొత్తంగా సుమారు రూ.11 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. డబ్బులు తీసుకున్న తర్వాత బాధితులకు చెల్లింపులు చేయకుండా, ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులో లేకుండా తప్పించుకుని తిరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుల గత నేర చరిత్రను పరిశీలించగా శ్రీధర్‌పై గతంలోనూ పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. గోదావరిఖని టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2016లో మోసం, నకిలీ పత్రాలకు సంబంధించిన కేసు నమోదైనట్లు తెలిపారు. చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో 2017లో నమోదైన మరో కేసులో శ్రీధర్, నందిని పేర్లు ఉన్నట్లు వెల్లడించారు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తి నుంచి రూ.5 లక్షలు వసూలు చేసినట్లు ఒక కేసు నమోదైందని పోలీసులు తెలిపారు. అలాగే డీజీపీ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.7.50 లక్షలు తీసుకున్న ఘటన కూడా వెలుగులోకి వచ్చినట్లు పేర్కొన్నారు.

హంస కలం వార్త
ఆదివారం 16 ఆగస్టు 2026

# బిజినెస్

# ఒకటి టెక్నాలజీతో.. మరొకటి దేశభక్తితో.. మహీంద్రా బీఈ6 కొత్త వేరియంట్లు ఇవిగో!

**స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మహీంద్రా బీజు 6లో రెండు కొత్త వేరియంట్లు విడుదల**

**బీజు 6 స్పోర్ట్రెక్, ఫార్ములా జు ఫ్రీడమ్ ఎడిషన్ పేర్లతో మార్కెట్లోకి ప్రవేశం**

**ట్రిపుల్ స్క్రీన్ డిస్‌ప్లే, గూగుల్ జెమిని అసిస్టెంట్‌తో ఆకట్టుకుంటున్న స్పోర్ట్రెక్ వేరియంట్**

**భారత త్రివర్ణ పతాకం డీకాల్స్‌తో ప్రత్యేకంగా ఫ్రీడమ్ ఎడిషన్ రూపకల్పన**

**బ్యాటరీ లీజు పద్ధతిలో రూ.11.45 లక్షల ప్రారంభ ధరకే స్పోర్ట్రెక్ కొనుగోలు చేసే అవకాశం**



దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా, 2026 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తన ఎలక్ట్రిక్ వాహన శ్రేణిని విస్తరించింది. తన పాపులర్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ అయిన బీఈ 6 లో రెండు సరికొత్త వేరియంట్లను శనివారం నాడు మార్కెట్లోకి విడుదల చేసింది. వీటిలో ఒకటి అధునాతన టెక్నాలజీతో కూడిన 'బీఈ 6 స్పోర్ట్రెక్' కాగా, మరొకటి స్పెషల్ ఎడిషన్ 'బీఈ6 ఫార్ములా జు ఫ్రీడమ్ ఎడిషన్'.

**ట్రిపుల్ స్క్రీన్‌తో కొత్త ఫ్లాగ్‌షిప్ స్పోర్ట్రెక్**

బీఈ 6 స్పోర్ట్రెక్ వేరియంట్‌ను కంపెనీ కొత్త ఫ్లాగ్‌షిప్‌గా పరిచయం చేసింది. దీని ఎక్స్-షోరూమ్ ధర రూ.19.45 లక్షలుగా నిర్ణయించారు. అయితే, 'బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్' విధానంలో కేవలం రూ.11.45 లక్షలకే ఈ కారును సొంతం చేసుకోవచ్చు. ఈ పద్ధతిలో కారు కొనుగోలు చేసి, బ్యాటరీని మాత్రం కంపెనీ నుంచి లీజుకు తీసుకోవాల్సి ఉంటుంది.ఈ వేరియంట్‌లో ప్రధాన ఆకర్షణ దాని ఇంటీరియర్. డాష్‌బోర్డ్ మధ్యలో ఉండే సెంట్రల్ స్క్రీన్‌ను పూర్తిగా తొలగించి, దాని స్థానంలో ఏకంగా మూడు 12.3-అంగుళాల భారీ డిస్‌ప్లేలను అమర్చారు. బ్లాక్ అండ్ టాన్ థీమ్‌తో క్యాబిన్ ఆకర్షణీయంగా ఉంది. ఇందులో సరికొత్త టెక్నాలజీ సూట్‌ను అందించారు. దీని ద్వారా గూగుల్ జెమిని వాయిస్ అసిస్టెంట్, ఆటోమేటిక్ డ్రైవర్ రికగ్నిషన్, డ్రిఫ్ట్ మోడ్, యాక్సిలరేషన్ బూస్ట్ వంటి అత్యాధునిక ఫీచర్లు లభిస్తాయి. ఈ కారు 79 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఆప్షన్‌తో పూర్తి ఛార్జింగ్‌పై గరిష్ఠంగా 682 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుందని కంపెనీ పేర్కొంది.

**ప్రత్యేక ఆకర్షణగా ఫ్రీడమ్ ఎడిషన్**

స్వాతంత్ర్య దినోత్సవం, ఫార్ములా జు రేసింగ్‌ను పురస్కరించుకుని 'బీఈ 6 ఫార్ములా జు ఫ్రీడమ్ ఎడిషన్'ను కూడా మహీంద్రా లాంచ్ చేసింది. దీని ఎక్స్-షోరూమ్ ధర రూ.24.45 లక్షలు. రోసో ఇంపుల్సో అనే ప్రత్యేకమైన ఎరుపు రంగు, భారత త్రివర్ణ పతాకం స్ఫూర్తితో రూపొందించిన డీకాల్స్, ఫార్ములా జు బ్యాడ్జ్‌లతో ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. అయితే, స్పోర్ట్రెక్ వేరియంట్‌లా కాకుండా ఇందులో పాత డాష్‌బోర్డ్ డిజైన్‌నే కొనసాగించారు. రెండు 12.3-అంగుళాల స్క్రీన్లు మాత్రమే ఉంటాయి. 16-స్పీకర్ల హార్మన్ కార్డన్ ఆడియో సిస్టమ్, 540 డిగ్రీల కెమెరా వంటి ప్రీమియం ఫీచర్లు ఇందులో ఉన్నాయి.

# ఒక్క పోస్ట్.. భారత క్రికెట్‌లో ముగిసిన ఒక స్వర్ణయుగం.. ధోనీ వీడ్కోలుకు ఆరేళ్లు!





**-ధోనీ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి ఆరేళ్లు పూర్తి**

**-2020 ఆగస్ట్ 15న రాత్రి 7:29కి ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటన**

**-మూడు ఐసీసీ ట్రోఫీలు గెలిచిన ఏకైక కెప్టెన్‌గా చారిత్రక రికార్డు**

**-ఐపీఎల్‌లో చెన్నైకి 5 టైటిళ్లు అందించిన ఎంఎస్‌డీ**

**-ప్రపంచ క్రికెట్‌లో ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన ధోనీ వారసత్వం**

భారత క్రికెట్ చరిత్రలో అదొక మరపురాని రోజు. దేశమంతా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో మునిగి తేలుతున్న వేళ, ఒక శకం ముగిసింది. సరిగ్గా ఆరేళ్ల క్రితం 2020 ఆగస్ట్ 15న రాత్రి 7:29 గంటలకు.. భారత క్రికెట్‌ను శాసించిన, అత్యంత ప్రభావవంతమైన ఆటగాళ్లలో ఒకడైన మహేంద్ర సింగ్ ధోనీ తన 15 ఏళ్ల అద్భుతమైన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఎలాంటి మీడియా సమావేశం లేదు, సుదీర్ఘ ప్రసంగాలు లేవు, ఆర్భాటాలు అసలే లేవు. తనకు మాత్రమే సాధ్యమైన రీతిలో అత్యంత నిశ్శబ్దంగా ధోనీ ఈ సంచలన నిర్ణయాన్ని ప్రకటించాడు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో, తన క్రికెట్ ప్రయాణంలోని మధురమైన చిత్రాలతో కూడిన ఒక వీడియోను పంచుకున్నాడు. ఆ వీడియో నేపథ్యంలోని 'మై పల్ దో పల్ కా షాయర్ హూన్' అనే ముకేశ్ పాట, అతని వీడ్కోలు భావనకు అద్దం పట్టింది. "ఇన్నాళ్లు మీరు చూపిన ప్రేమ, మద్దతుకు ధన్యవాదాలు. ఈ రోజు రాత్రి 7:29 గంటల నుంచి నన్ను రిటైర్ అయిన వ్యక్తిగా పరిగణించండి" అని క్లుప్తంగా రాసుకొచ్చాడు. అంతే.. ఒక్క పోస్ట్‌తో భారత క్రికెట్‌లో ఒక స్వర్ణయుగం ముగిసిపోయింది. నాయకత్వానికి కొత్త అర్థం చెప్పిన, ఒత్తిడిలో మ్యాచ్‌లను ముగించడంలో తనకు తానే సాటి అని నిరూపించుకున్న ఒక గొప్ప యోధుడు మైదానం నుంచి అలా నిష్క్రమించాడు. 2004లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన ధోనీ, ఆ తర్వాత చరిత్ర సృష్టించాడు. మూడు ప్రధాన ఐసీసీ ట్రోఫీలు (టీ20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ) గెలిచిన ప్రపంచంలోని ఏకైక కెప్టెన్‌గా రికార్డు సృష్టించాడు. 2007లో తొలి టీ20 ప్రపంచకప్‌ను యువ జట్టుతో గెలిచి సంచలనం సృష్టించాడు. ఆ తర్వాత 2011లో వాంఖడే స్టేడియంలో సిక్సర్‌తో వన్డే ప్రపంచకప్‌ను అందించి భారతీయుల 28 ఏళ్ల నిరీక్షణకు తెరదించాడు. 2013లో ఛాంపియన్స్ ట్రోఫీ గెలుపుతో అతని కెప్టెన్సీ ప్రస్థానం పరిపూర్ణమైంది. ఆటగాడిగానూ ధోనీ గణాంకాలు అద్భుతం. 350 వన్డేల్లో 10,773 పరుగులు, 90 టెస్టుల్లో 4,876 పరుగులు చేశాడు. 98 టీ20 మ్యాచ్‌లలోనూ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. వికెట్ల వెనుక అతడి చురుకుదనానికి 829 అంతర్జాతీయ డిస్మిసల్స్ నిదర్శనం. ప్రపంచంలోని గొప్ప వికెట్ కీపర్-బ్యాటర్లలో ఒకరిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. 2019 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్‌లో న్యూజిలాండ్‌పై ఆడిన మ్యాచే మహీ చివరి అంతర్జాతీయ మ్యాచ్.అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా, క్రికెట్‌కు మాత్రం దూరం కాలేదు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుకు నాయకుడిగా కొనసాగుతూ, ఆ జట్టుకు ఐదుసార్లు టైటిల్స్ అందించాడు. 2023లో కూడా సీఎస్‌కేను ఛాంపియన్‌గా నిలబెట్టడం ధోనీ నాయకత్వ పటిమకు నిదర్శనం.ధోనీ వారసత్వం కేవలం ట్రోఫీలు, పరుగులకు మాత్రమే పరిమితం కాదు. ఎంతటి ఒత్తిడిలోనైనా ప్రశాంతంగా ఉంటూ నిర్ణయాలు తీసుకోవడం అతని ప్రత్యేకత. ఆరేళ్లు గడిచినా, ఇప్పటికీ ఆగస్ట్ 15న రాత్రి 7:29 గంటలు అయిందంటే కోట్లాది మంది అభిమానుల గుండెల్లో మహీ జ్ఞాపకాలు మెదులుతూనే ఉంటాయి.

# క్రీడలు

## పడిక్కల్ సూపర్ సెంచరీ.. గాలే టెస్టులో ముగిసిన తొలి రోజు ఆట

శ్రీలంకతో తొలి టెస్టులో సెంచరీతో మెరిసిన దేవదత్ పడిక్కల్ కండరాల నొప్పితో 77 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన కేఎల్ రాహుల్ తొలి రోజు ఆట ముగిసేసరికి 2 వికెట్లకు 288 పరుగులు చేసిన భారత్ వెలుతురు లేమి, వర్షం కారణంగా ముందుగానే ముగిసిన తొలి రోజు ఆట శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అద్భుత శతకంతో కదం తొక్కాడు. దాదాపు రెండేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి వచ్చిన పడిక్కల్ (131 నాటౌట్), తన కెరీర్‌లో తొలి సెంచరీని నమోదు చేశాడు. అతనికి తోడు వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ (77 రిటైర్డ్ హర్ట్) కూడా రాణించడంతో, శనివారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. వెలుతురు లేమి, వర్షం కారణంగా ఆటను ముందుగానే నిలిపివేసే సమయానికి టీమిండియా 73 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. గాలే అంతర్జాతీయ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (32), కేఎల్ రాహుల్ శుభారంభం అందించారు. అయితే, జైస్వాల్ రనౌట్‌గా వెనుదిరిగాడు.ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన పడిక్కల్, రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, తీవ్రమైన కండరాల నొప్పితో కేఎల్ రాహుల్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది. గాయపడిన సాయి సుదర్శన్ స్థానంలో జట్టులోకి వచ్చిన పడిక్కల్, లభించిన అవకాశాన్ని రెండు చేతులా అందిపుచ్చుకున్నాడు. క్రీజును చక్కగా ఉపయోగించుకుంటూ, అద్భుతమైన ఫుట్‌వర్క్‌తో లంక బౌలర్లను ఎదుర్కొన్నాడు. ముఖ్యంగా బ్యాక్ ఫుట్‌పై ఆకట్టుకునే షాట్లు ఆడాడు. 134 బంతుల్లో తన తొలి టెస్ట్ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. 2002లో సౌరవ్ గంగూలీ తర్వాత భారత జట్టులో మూడో స్థానంలో టెస్టు శతకం సాధించిన తొలి ఎడమచేతి వాటం బ్యాటర్‌గా పడిక్కల్ రికార్డు సృష్టించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (16) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య బౌలింగ్‌లో అనవసర షాట్‌కు యత్నించి మిడ్-ఆఫ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ (27 నాటౌట్) తనదైన శైలిలో దూకుడుగా ఆడాడు. పడిక్కల్‌తో కలిసి అజేయంగా 52 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వర్షం కారణంగా ఆట కాసేపు నిలిచిపోయినా, బ్యాటర్ల జోరు తగ్గలేదు. పడిక్కల్ 178 బంతుల్లో 12 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 131 పరుగులు, పంత్ 36 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 27 పరుగులతో క్రీజులో ఉన్నారు. రెండో రోజు ఆట 15 నిమిషాలు ముందుగా ప్రారంభం కానుండగా, భారత్ 500 పైచిలుకు స్కోరుపై కన్నేసింది.



# ‘హుషార్ పిట్టలు’ మూవీ రివ్యూ



ఈ మధ్య కాలంలో టీజర్‌తో హాట్‌టాపిక్‌గా మారిన చిత్రం ‘హుషార్ పిట్టలు’. టీజర్‌లో ఉన్న బోల్డ్ కంటెంట్ యువతను ఆకట్టుకుంది. దీంతో పాటు పాటలు, ట్రైలర్ కూడా ఆకట్టుకోవడంతో ఈ సినిమా చూడాలన్న ఆసక్తి యూత్‌లో కలిగింది. నూతన తారాగణంతో, బిక్షు అనే నూతన దర్శకుడు తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 15న విడుదలైంది. ఇక ఈ సినిమా ఎలా ఉంది? యూత్‌ను అలరించే అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయా? ప్రేక్షకులకు ఈ సినిమా ఎలాంటి అనుభూతిని అందించింది? అనేది రివ్యూలో తెలుసుకుందాం. రవి (అన్ష్) టెన్త్‌లో టాపర్. స్కూల్‌లో ఫస్ట్. చదువు అంటే ఎంతో ఇష్టం. ఇలాంటి కుర్రాడిని ఆ ఊరిలో ఉండే ఆకతాయి బాలు గ్యాంగ్ మొబైల్‌లో అశ్లీల వీడియోలు చూపించి అతని దృష్టిని చెడు వైపు మళ్లీస్తారు. దీంతో చదువు మీద ఆసక్తిని పక్కకు పెట్టేసి అమ్మాయిలపై దృష్టి పెడతాడు. ఆ సమయంలోనే ఆ ఊరిలో ఉండే చిట్టి (వాసవి గణేషన్) రవిని చూసి ఆకర్షణలో పడిపోతుంది. అప్పటికే ఇద్దరికి ఒకరిపై ఒకరికి ఆకర్షణ ఉండటంతో, పరిపక్వత లేని వయసులోనే ఇద్దరు హద్దులు దాటేస్తారు. కొన్ని రోజులు వీళ్లు ఎవరికి తెలియకుండా ఇలాగే కలుస్తుంటారు. ఒక రోజు అనుకోకుండా ఇద్దరూ ఒకే గదిలో ఉన్న సమయంలో తల్లిదండ్రులకు దొరికిపోతారు. ఇక ఆ సిట్యుయేషన్‌లో తమ పిల్లలను చూసిన పేరెంట్స్ ఎలాంటి క్షోభను అనుభవించారు? పిల్లల విషయంలో తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయాలు ఏమిటి? రవి, చిట్టిల జీవితంలో చోటు చేసుకున్న సంఘటనలేమిటి? ఈ జంట తమ ప్రేమను గెలిపించుకున్నారా? చిన్న వయసులో ఆకర్షణకు లోనై వాళ్లు చేసిన తప్పుల వల్ల వాళ్ల జీవితాలు ఎలా మారాయి? అనేది మిగతా కథ. యూత్‌ను లక్ష్యంగా బోల్డ్ కంటెంట్‌కు ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు సందేశాన్ని జోడించి దర్శకుడు ఈ కథను తయారుచేసుకున్నాడు. టీజర్, ట్రైలర్‌లు కూడా బోల్డ్‌గానే ఉండటంతో ఈ సినిమాపై యూత్‌కు ఓ అంచనాకు వచ్చేశారు. ఫస్ట్‌హాఫ్‌లో రెండు ఆకట్టుకునే పాటలు, బోల్డ్ కంటెంట్, ఎంటర్‌టైన్‌మెంట్‌తో యూత్ కావాల్సిన అంశాలు పుష్కలంగా నింపేశాడు. దర్శకుడు ఫస్ట్‌హాఫ్‌లో బోల్డ్ కంటెంట్‌ను ఎంత శ్రద్ధగా రాసుకున్నాడో.. సెకండాఫ్‌లో ఫ్యామిలీ ఎమోషన్స్‌ను కూడా అంతకు మించి బలమైన భావోద్వేగాలను రెడీ చేసుకుని హృదయాలకు హత్తుకునే విధంగా స్క్రీన్‌పై ప్రజెంట్ చేశాడు. ముఖ్యంగా పతాక సన్నివేశాల్లో ఉన్న సందేశాన్ని కన్వీన్సింగ్ చెప్పడంలో దర్శకుడు సఫలీకృతుడయ్యాడు. హీరో, హీరోయిన్ల పరిచయం, వారి మధ్య వచ్చే సన్నివేశాలు, బాలు గ్యాంగ్‌తో హీరో జరిపే సంభాషణలు, శైలు అక్కతో హీరోయిన్ చేసే సాహసాలు ఇవన్నీ ప్రేక్షకులు వినోదంతో పాటు థ్రిల్‌ను పంచుతాయి. ఇక రవి, చిట్టిల రహస్య కలయిక బయటపడిన తరువాత ద్వితీయార్థాన్ని దర్శకుడు ఎలా డీల్ చేస్తాడో అనే సందేహం అందరిలో కలుగుతుంది. అయితే సెకండాఫ్‌లో బలమైన ఎమోషన్ రెడీ చేసుకుని, రవి, చిట్టిలు ఇలా తప్పటడుగులు వేయడానికి కారణాన్ని చెప్పడంలో, ఆ రీజన్స్ కరెక్టేనని ఆడియన్స్ భావించే విధంగా దర్శకుడు డీల్ చేశాడు. చిన్నప్పటి నుంచే సెల్‌ఫోన్‌కు ఎడిక్ట్ అవ్వడం, తప్పుడు స్నేహాలు, వాళ్ల పిల్లలు ఎలాంటి తప్పుదారుల్లో నడిచే అవకాశం ఉందో చెప్పి అందర్ని ఆలోచింపజేశారు. పిల్లలు తప్పుదారిలో నడవడం వల్ల తల్లిదండ్రులు ఎలాంటి క్షోభ అనుభవించాల్సి వస్తుందనే విషయాన్ని కొన్ని సన్నివేశాల్లో ఆవిష్కరించారు. పతాక సన్నివేశాలు ఎంతో భావోద్వేగభరితంగా ఉంటాయి. ఓవరాల్‌గా దర్శకుడు ఓ సక్సెస్ కోసం అన్ని ప్యారామీటర్‌లో సరైన కొలతలతో ఎంతో తెలివిగా ఈ చిత్రాన్ని రూపొందించాడనే భావన కలుగుతుంది.దమాసినపల్లి రవి పాత్రలో అన్ష్, చిట్టి పాత్రలో వాసవి గణేషన్ ఎంతో సహజంగా నటించారు. ఇద్దరి పెయిర్ కూడా బాగుంది. కొత్తవారైనా రొమాంటిక్ సన్నివేశాల్లో, ఎమోషన్ సీన్స్‌ల్లో కూడా ఎలాంటి తడబాటు లేకుండా పర్‌ఫార్మ్ చేశారు. చిట్టి పాత్ర ఎంతో క్యూట్‌గా అనిపించింది. ముఖ్యంగా ఈ రెండు పాత్రలు యువతను బాగా అలరిస్తాయి. హీరోయిన్ తండ్రి పాత్రలో గోవర్ధన్, హీరో తండ్రి రమేష్‌లు ఆ పాత్రలకు న్యాయం చేశారు. మిగతా ఫ్రెండ్స్ గ్యాంగ్ కావాల్సినంత వినోదాన్ని అందించారు. తొలి చిత్రమైనా దర్శకుడు ఎంతో ఎక్స్‌పీరియన్స్ డైరెక్టర్‌లా ఈ కథను డీల్ చేశాడు. చిన్ని చరణ్ పాటలు, నేపథ్య సంగీతం ఈ చిత్రానికి ప్లస్. డీవోపీ రుద్రసాయి విజువల్స్ కూడా ఎంతో నేచురల్‌గా ఓ గ్రామీణ వాతావరణాన్ని ఆహ్లాదంగా చూపించాయి. యువతరాన్ని లక్ష్యంగా చేసుకుని తెరకెక్కించిన ‘హుషార్ పిట్టలు’ చిత్రంలో యువతరానికి నచ్చే అంశాలతో పాటు పరిణతి లేని ఆకర్షణ, ప్రేమల వల్ల జీవితంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందో బలంగా చెప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా యువతరానికి నచ్చే సినిమా ‘హుషార్ పిట్టలు’

# బిగ్‌బాస్ 10: ఈసారి ‘దశావతారం’.. ఆటే ఒక సవాల్!

**త్వరలో ప్రారంభం కానున్న బిగ్‌బాస్ తెలుగు సీజన్ 10**
**హోస్ట్‌గా మరోసారి అక్కినేని నాగార్జున**
**‘దశావతారం’ థీమ్‌తో పదింతల డ్రామా, సర్‌ప్రైజ్‌లు**
**‘ఆటలో సవాల్ కాదు.. ఆటే సవాల్’ అనే కొత్త ట్యాగ్‌లైన్**
**‘అగ్నిపరీక్ష’ ద్వారా సామాన్యుల ఎంపిక ప్రక్రియ**



తెలుగు టెలివిజన్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్న రియాలిటీ షో ‘బిగ్‌బాస్’ సరికొత్త హంగులతో పదో సీజన్‌తో సందడి చేసేందుకు సిద్ధమైంది. కింగ్ అక్కినేని నాగార్జున మరోసారి హోస్ట్‌గా వ్యవహరించనున్న ఈ సీజన్‌పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈసారి షో మునుపటి కంటే భిన్నంగా, మరింత ఉత్కంఠభరితంగా ఉండబోతోందని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ సీజన్ గురించి నాగార్జున మాట్లాడుతూ, ఇది నెక్స్ట్ లెవల్‌లో ఉంటుందని, వెరైటీ, సర్‌ప్రైజ్‌లు, డ్రామా, సవాళ్లు పదింతలు అధికంగా ఉంటాయని తెలిపారు. ఈ సీజన్‌ను ‘దశావతారం’గా అభివర్ణించిన ఆయన, ప్రతి వారం బిగ్‌బాస్ ఒక కొత్త అవతారం ఎత్తుతాడని, ఇది కంటెస్టెంట్లకు ఊహించని మలుపులను ఇస్తుందని అన్నారు. దీనికి తగ్గట్టుగానే “ఆటలో సవాల్ కాదు.. ఆటే సవాల్” అనే కొత్త ట్యాగ్‌లైన్‌ను విడుదల చేశారు. ఈ ట్యాగ్‌లైన్ షో స్వరూపాన్నే మార్చేలా ఉందనిపిస్తోంది. ప్రస్తుతం కంటెస్టెంట్ల ఎంపిక ప్రక్రియ వేగంగా జరుగుతోంది. కొంతమంది సినీ, టీవీ నటీనటులను నేరుగా ఎంపిక చేయగా, సామాన్య ప్రజల కోసం ‘అగ్నిపరీక్ష’ పేరుతో ప్రత్యేక ఆడిషన్లు నిర్వహిస్తున్నారు. ఈ అగ్నిపరీక్షకు న్యాయనిర్ణేతలుగా బిగ్‌బాస్ మాజీ కంటెస్టెంట్లు అయిన నవదీప్, బిందు మాధవి, అభిజీత్‌లు వ్యవహరిస్తున్నారు. వీరి పర్యవేక్షణలో సామాన్యుల నుంచి తుది జాబితాను ఖరారు చేయనున్నారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుని, బిగ్‌బాస్ తెలుగు సీజన్ 10 సెప్టెంబర్ మొదటి వారంలో ప్రారంభం కానుందని సమాచారం. సరికొత్త థీమ్, ఆసక్తికరమైన కంటెస్టెంట్లతో ఈ పదో సీజన్ ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని ఇస్తుందో చూడాలి.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449